ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 5 జూలై 2024





తెనాలి: గుర్రపుడెక్కతో నిండిన నల్ల కాల్వ

మరమ్మతులు చేయాలి

- పూడికతో నిండిన సాగునీటి కాల్వలు
- వైసీపీ పాలనలో పట్టించుకున్న దాఖలాలే లేవు
- కృష్ణా పశ్చిమ డెల్టాలో నామరూపాలు కోల్పోయిన ఆధునికీకరణ
- నేడు మంత్రి నిమ్మల సమీక్ష..
- డెల్టా, సాగర్ కాల్వలకు నిధులు కేటాయించేనా?

వరుణుడు కరుణిస్తున్నాడు.. వర్షాలు పడుతున్నాయి.. అడపాదడపా సాగునీరు విడుదలవుతుంది.. అయినా పంటలు చేతికిరావడంలేదు. రైతుల ఇంట సిరులు కురిపించాల్సిన పంటలు నీరు లేక ఎండిపోతున్నాయి. కాల్వల్లో సాగునీరు సక్రమంగా పారి పొలాలను తడిపితే ఈ దుస్థితి ఉండదు. కానీ పూడిక, జమ్ముతో పూడిపోయిన కాల్వల్లో సాగునీరు పారుదల కావడంలేదు. దీంతో సకాలంలో పంటలకు నీరందక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి కాల్వల బాగు కాదు కదా కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదు. పంటలు ఎండిపోతున్నాయి.. రక్షించండి మహాప్రభో అని అన్నదాతలు వేడుకున్నా పాలకులకు పట్టలేదు. గతంలో సాగునీటి సంఘాలు కాల్వల బాగుపై దృష్టి సారించేవి.. వాటిని కూడా వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో సాగునీటి కాల్వలు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నేపథ్యంలో సాగునీటి కాల్వల బాగుపై పాలకులు దృష్టి పెట్టాలని రైతులు అభ్యర్థిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సచివాలయంలో ప్రత్యేకంగా సమీక్ష చేయనున్నారు. సాగర్, డెల్టా కాల్వల మరమ్మతులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులు కోరుతున్నారు.

నరసరావుపేట



అధ్వానస్థితిలో చిలకలూరిపేట మేజర్ కాల్వ



బాపట్ల: పూడికతీతలు లేక వ్యర్థాలతో పేరుకుపోయిన రేపల్లె పరిధిలోని మెయిన్ కెనాల్

గుంటూరు, నరసరావుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పూడిక, జమ్ము, నాచులతో నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలోని కాల్వలు, పశ్చిమ డెల్టా పరిధి లోని సాగునీటి కాల్వలు నిండి పోయి ఉన్నాయి. మేజర్లు, మైనర్లు, సబ్‌మైనర్ కాల్వలు శిథిల స్థితికి చేరుకున్నాయి. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. కాల్వల్లో కంపచెట్లు పెద్దఎత్తున పెరిగాయి. జమ్ము, తూటు కాడ, రబ్బరు మొక్కలు కాల్వల నిండా అల్లుకుపోయాయి. ఇవి నీటి సరఫరాకు అవరోధంగా ఉన్నాయి. ఐదేళ్లుగా ప్రభుత్వం వాటి బాగుపై దృష్టి సారించ లేదు. మరమ్మతులకు నిధుల విడుదల చేయకుండా ప్రభుత్వం కాల్వలను గాలికొదిలేసింది. దీంతో సాగు నీటి కోసం రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎండిపోతున్న పంటలను కాపాడుకునేం దుకు రైతులు నానాకష్టాలు పడాల్సి వచ్చినా పాల కుల్లో చలనంలేదు. కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వల్లో సాగునీరు ప్రవహించడం కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో మంత్రి నిమ్మల రామానాయుడు కృష్ణా డెల్టా, సాగర్ కాల్వలపై సమీక్ష నిర్వహించనున్న దృష్ట్యా ఆయన తొలుత ఇక్కడ నెలకొన్న పరిస్థితుల పై స్పష్టమైన అవగాహన ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని సాగునీటి రంగ నిపుణులు సూచిస్తున్నారు. కాల్వల మరమ్మతులకు నిధుల మంజూరుపై మంత్రి నిర్ణయం తీసుకోనున్నారు.

దారుణంగా కృష్ణా పశ్చిమ డెల్టా..

గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలో కృష్ణా పశ్చిమ డెల్టా కింద 5.70 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో డ్రెయినేజీ వ్యవస్థని కూడా పశ్చిమ డెల్టా కలిగివున్నది. అటు కాల్వలు, ఇటు డ్రెయినేజీ సక్రమంగా ఉంటేనే పంటలు సజావుగా పండుతాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కూడా వరదనీరు డ్రెయినేజీ కాల్వల ద్వారా బయటకు వెళ్లిపోయి నష్టం తగ్గుతుంది. టీడీపీ హయాంలో 2014-15లో రూ.116.16 కోట్లు, 2015-16లో రూ.63.40 కోట్లు, 2016-17లో రూ.40.31 కోట్లు, 2017-18లో రూ.119.84 కోట్లు, 2018-19లో రూ.106.65 కోట్లను డెల్టా ఆధునికీకరణ కోసం ఖర్చు చేసింది. అయితే ఆ తర్వాత పగ్గాలు చేపట్టిన వైసీపీ ప్రభుత్వం కాల్వల నిర్వహణను గాలికొదిలేసింది. గత ఐదేళ్లలో ఏడాదికి సగటున రూ.9 కోట్ల వరకు కేవలం ఓ అండ్ ఎం పనులకు మాత్రమే నిధులు ఇచ్చింది. అయితే ఆయా పనులను ఇరిగేషన్ శాఖ సక్రమంగా చేయకుండా బిల్లులు డ్రా చేసుకున్నది. నేడు కృష్ణా పశ్చిమ డెల్టాలో ఏ కాల్వని చూసినా బావురుమనాల్సిన పరిస్థితి. కాల్వ గట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేయలేని పరిస్థితి. హెడ్ రెగ్యులేటర్లు, రెగ్యులేటర్లు మరమ్మతులకు గురై ఉన్నాయి. అక్కడక్కడ నిర్మించిన రిటైనింగ్ వాల్స్, సిమెంట్ కాంక్రీట్ లైనింగ్‌లు కొట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం గత నెలలో అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 13.62 కోట్లు విలువ చేసే ఓ అండ్ ఎం పనులను మళ్లీ అధికారులు ప్రతిపాదించారు. తెనాలి డివిజన్‌లో 85 పనులకు రూ.4.98 కోట్లు, రేపల్లె డ్రైనేజీ డివిజన్‌లో 61 పనులను రూ.3.55 కోట్లు, చీరాల డివిజన్‌లో 37 పనులకు రూ.3.75 కోట్లు, గుంటూరు ఛానెల్‌కు సంబంధించి ఐదు పనులను రూ.1.31 కోట్లతో ప్రతిపాదించారు. అయితే ఇవి ఏ మేరకు కాల్వల్లో సాగునీటి ప్రవాహానికి ఉపయోగపడతాయనేది ప్రశ్నార్థకమే. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సీజన్ వచ్చేసింది. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నీటిని కూడా కృష్ణా డెల్టాకు తరలింపు ప్రక్రియని టీడీపీ ప్రభుత్వం ప్రారంభించింది. దీని దృష్ట్యా ఓ అండ్ ఎం పనులను వేగవంతంగా పూర్తి చేయించి రాబోయే ఐదేళ్లలో కాలువలకు శాశ్వత మరమ్మతులు చేయించడంపై దృష్టి పెట్టాలి.

ఆధునికీకరణ అస్తవ్యస్తం

"కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వల్లో ఏళ్లుగా సాగుతున్న ఆధునికీకరణ పనులు ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యం కారణంగా నామరూపాలు లేకుండా పోయాయి. మూడు జిల్లాలకు సంబంధించి కొమ్మమూరు కాల్వ ఆధునికీకరణని తూతూమంత్రంగా చేసి పనులు నిలిపేశారు. మరోవైపు ఈపీసీ పద్ధతిలో కాంట్రాక్టులు దక్కించుకున్న ఏజెన్సీలు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు, బిల్లులు డ్రా చేసుకుని పత్తా లేకుండా పోయాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కేవలం సీజన్‌లో కనీస పునరావాస మరమ్మతులు(ఓ అండ్ ఎం) మినహా మరెలాంటి పనులు చేపట్టలేదు. ఈ సంవత్సరం కూడా అవే పనులను ప్రతిపాదించారు. ఇవి ఇంజనీర్లకు జేబులు నింపడానికి పనికొస్తున్నాయి తప్ప కాల్వల్లో నీటి ప్రవాహానికి ఏమాత్రం మేలు చేకూర్చడం లేదు."

తక్షణావసరమైన పనుల గుర్తింపు

"నాగార్జునసాగర్ కుడికాల్వల మరమ్మతులకు సంబంధించి ఇప్పటికే జలవనరులశాఖ 473 పనులను గుర్తించింది. రూ.22.54కోట్ల అంచనాతో ప్రతిపాదనలను మంత్రి నిమ్మల రామానాయుడికి అందజేసింది. తక్షణావసరమైన పనులు చేపట్టాలని ప్రభుత్వం జలవనరుల శాఖ అధికారులకు సూచించింది. సాగర్ లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో 473 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ.22.54 కోట్లుగా అంచనా వేశారు. కాల్వల్లో పూడిక తీత, కంపచెట్లు, జమ్ము, తూటుకాడ తొలగింపు పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించారు. లింగంగుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 153 పనులకు రూ.7.63కోట్లు, మాచర్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 133 పనులకు రూ.6.38కోట్లు, సత్తెనపల్లి పరిధిలో 107 పనులకు రూ.5.09కోట్లు, వినుకొండ పరిధిలో 24 పనులకు రూ.2.12 కోట్లు, లింగంగుంట్ల డివిజన్ పరిధిలో 56 పనులకు రూ.2.29 కోట్లుగా అధికారులు అంచనా వేశారు."





వైసీపీకి.. పేదల ఉసురు

- రాజధానిలో నిరుపేదల పింఛన్ కట్
- మూల్యాంకనం పేరుతో 4,422 మందికి తొలగింపు
- శ్వేతపత్రంలో గణాంకాల సహా వెల్లడించిన సీఆర్‌డీఏ
- అటు పింఛన్ అందక.. ఇటు పనులు లేక ఇబ్బందులు

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధానిగా వెలుగులీనాల్సిన అమరావతిని పాడుపెట్టిన వైసీపీ ప్రభుత్వం పేదలనూ వదల్లేదు. రాజధానికి రైతులు భూములు ఇవ్వడంతో కూలీలు వ్యవసాయ పనులు కోల్పోయారు. ఈ క్రమంలో రైతులకు కౌలుతో పాటు నిరుపేదలకు పింఛన్లను టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే 2019లో అధికారం చేపట్టిన వైసీపీ అమరావతి రాజధాని పనులను ఆపేసిన విషయం తెలిసిందే అదేవిధంగా అమరావతి పరిధిలో భూమిలేని నిరుపేదలు అప్పటివరకు పొందుతున్న పింఛన్‌ని లాగి పారేసింది. దాంతో వారంతా అటు పనులు లేక ఇటు పింఛన్ అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పేరుకు పింఛన్ల సంఖ్య పెంచామని డప్పు కొట్టుకొన్న నాటి సీఎం జగన్ అమరావతిలో తొలగించిన 4,422 మంది పింఛన్ల గురించి ఏమి సమాధానం చెబుతారన్న ప్రశ్న తలెత్తుతున్నది. అమరావతి రాజధానిపై తాజాగా సీఎం చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రంలో ఈ విషయాన్ని ఏపీసీఆర్‌డీఏ గణాంకాల సహా కళ్లకు కట్టింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధానిలో భూమిలేని పేదలు దాదాపుగా 21,643 మందికి పింఛన్ అందేది. వైసీపీ అధికారంలోకి రాగానే ఆరు అంచెల మూల్యాంకనాన్ని అమలు చేసింది. దీనిని గతంలో ఏ ప్రభుత్వం అమలు చేసిన దాఖలాలు లేవు. తెల్లరంగు రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకుని పింఛన్లకు ఎంపిక చేసేవారు. 2019-20లో 20706 మందికి రూ.61.79 కోట్ల పింఛన్ అందింది. 2020-21లో ఈ సంఖ్య 19532కి తగ్గించారు. దాంతో రూ.58.41 కోట్లు చెల్లించారు. 2021-22లో 19425 మందికి రూ.57.75 కోట్లు చెల్లించారు. 2022-23లో 19,118 మందికి రూ.53.73 కోట్లు చెల్లించారు. 2022లో సెప్టెంబరు, అక్టోబరు పింఛన్లు నేటికీ చెల్లించలేదు. 2023-24లో పింఛన్ల సంఖ్యలో భారీగా కోత పెట్టి 17391కి కుదించారు. వీరికి రూ.56.35 కోట్లు చెల్లించారు. 2024-25లో 17221 మందికి మే నెల వరకు పింఛన్ల చెల్లింపు జరిగింది. ఇందుకోసం రూ.17.23 కోట్లు చెల్లించారు. అమరావతి రాజధానిపై అక్కసు, ఆర్థికభారాన్ని తగ్గించుకునే లక్ష్యంతో అర్హులైన 4,422 మంది పేదలను పింఛన్‌కు దూరం చేసింది. కారు లేకపోయినా ఉన్నట్లుగా, ఆదాయపు పన్ను చెల్లించకపోయినా ఐటీ కట్ అవుతున్నట్లుగా చూపించారు. అలానే ఎవరెవరి పేరుతో ఉన్న భూములు, ఆస్తులు పేదల పేర్లతో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లు అధికంగా వస్తుందని కూడా సాకు చూపించి పింఛన్ కోత విధించారు. దాంతో ఆయా పేదలకు నోటి కాడ కూడు లాగేసినట్లైంది. ప్రస్తుతం టీడీపీ నేతృత్వ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దృష్ట్యా తమ పింఛన్లను పునరుద్ధరించాలని బాధితులు కోరుతున్నారు. కాగా వారిలో కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



కొల్లూరులో విద్యా సంస్థల బంద్‌లో పాల్గొన్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

బాపట్ల, కొల్లూరు, జూలై 4: నీట్ లీకేజ్‌ని నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. బంద్ విజయవంతమైనట్లు విద్యార్థి సంఘాలు నాయకులు ప్రకటించారు. కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల వద్దకు ఎస్ఎఫ్ఐ నాయకులు ర్యాలీగా వెళ్లి వాటిని మూయించారు. ఈ సందర్భంగా బాపట్లలో ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎన్.భానుతేజ మాట్లాడుతూ నీట్ లీకేజి వల్ల లక్షల మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలోని 61 వేల పాఠశాలల మూతతో విద్యా వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. యూనివర్సిటీల్లో అన్యాయాలను ప్రశ్నిస్తున్న విద్యార్థులపై పెడుతున్న అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయిలో విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అవినాష్, నితిన్, శివమణి, ఆనంద్, బాబి, ఆదిత్య పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొల్లూరు మండలంలోని అన్ని విద్యా సంస్థలను మూయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అభిషేక్, విజయేంద్ర, చొప్పర కోటేశ్వరరావు, చైతన్య, జయశంకర్, రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌గా.. వెంకటమురళి

- జేసీ శ్రీధర్ నుంచి బాధ్యతల స్వీకరణ
- కలెక్టరేట్‌లో మేళతాళాలతో ఘన స్వాగతం
- ప్రభుత్వ లక్ష్యాలు.. ప్రజల ఆకాంక్ష నెరవేర్చాలని దిశానిర్దేశం

బాపట్ల, జూలై 4: బాపట్ల కలెక్టర్‌గా గురువారం జె.వెంకటమురళి ఇన్‌చార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌కు వచ్చిన వెంకటమురళికి ఉద్యోగులు, అధికారులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనకు వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ప్రభుత్వ లక్ష్యాలు.. ప్రజల ఆకాంక్ష నెరవేర్చాలని ఈ సందర్భంగా ఉద్యోగులకు నూతన కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందేలా కృషి చేస్తానని చెప్పారు. ఉద్యోగులంతా కలిసి పనిచేస్తే లక్ష్యాలు సాధించవచ్చన్నారు. సమయపాలన పాటిస్తూ జవాబుదారితనంతో ఉద్యోగులు పనిచేయాలన్నారు. జిల్లాను మరింత అభివృద్ధిలోకి తీసుకెళ్లడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజలు కలిసి పనిచేయాలన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్‌లతో చర్చించామన్నారు. ప్రభుత్వ సంక్షేమఫలాలు ప్రజలందరికీ చేరువయ్యేలా చూడాలని తెలిపారు. అనంతరం కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటమురళిని ఏఎస్పీ విఠలేశ్వర్, డీఆర్వో సత్తిబాబుతో పాటు ఆర్డీవోలు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.



కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న జె.వెంకటమురళి

- నూతన కలెక్టర్‌పై ఎన్నో ఆశలు
- కలెక్టర్‌గా వెంకటమురళికి తొలి పోస్టింగ్

సమస్యలు.. సవాళ్లు

బాపట్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పూడికతీతలు లేక అధ్వానంగా మారిన సాగునీటి కాల్వలు, గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చీరాలలో టెక్స్‌టైల్ పార్కు, నిజాంపట్నం పోర్టు, అసైన్డ్ భూములు అన్యాక్రాంతం.. ఇలా పరిష్కరించాల్సిన ఎన్నో సమస్యలు జిల్లాలో ఉన్నాయి. ఈ సమస్యల సవాళ్ల మధ్య వెంకటమురళి గురువారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. నూతన జిల్లాగా బాపట్ల ఆవిర్భవించినా జిల్లాలో పూర్తి స్థాయిలో సిబ్బంది లేరు. జిల్లా స్థాయికి తగినట్లుగా ప్రభుత్వ స్థాయిలో వనరులు సమకూరలేదు. ఈ పరిస్థితుల్లో కలెక్టర్‌గా వెంకటమురళి తొలి పోస్టింగ్‌తో బాపట్లకు వచ్చారు. 2020లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వెంకటమురళి పనిచేశారు. ప్రస్తుత బాపట్ల జిల్లాలో భాగంగా ఉన్న పర్చూరు, చీరాల, అద్దంకి మీద ఆయనకు పూర్తి స్పష్టత ఉంది. ఇక మిగిలిందల్లా బాపట్ల, రేపల్లె, వేమూరులే కావడంతో త్వరగానే పాలన పట్టాలెక్కించడంతో పాటు సమస్యలను త్వరితగతిన పరిష్కారిస్తారనే ఆశాభావాన్ని జిల్లా ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

- తీర ప్రాంతంలో పర్యాటకం అభివృద్ధికి అవకాశమున్నా ఎవరూ పట్టించుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో కట్టి వదిలేసిన టిడ్కో ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. మైనర్ బ్రిడ్జీలు కనీస మరమ్మతులకు నోచుకోక ప్రమాద ఘంటికలుగా మారాయి. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చీరాలలో టెక్స్‌టైల్ పార్కు, నిజాంపట్నం పోర్టు ఇలా ఎన్నో హామీలు అమలుకు నోచుకోక ఎదురుచూస్తున్నాయి. జిల్లాలో ఉన్న రోడ్లపై ఐదేళ్లుగా కనీసం తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదు. తక్షణమే వీటి బాగుమీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. కాల్వల్లో గుర్రపుడెక్క, వ్యర్థాలు పేరుకుపోవడంతో నీరు సరిగా పారక చివరి ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్ దృష్ట్యా వెంటనే కాల్వల బాగుపై దృష్టిపెట్టి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. కౌలుదారులకు సీసీఆర్‌సీ కార్డులతో పాటు, ఇంతవరకు బ్యాంకర్లు ఇంకా వార్షిక రుణ పద్దును ప్రకటించలేదు. వెంటనే దానిపై శ్రద్ధపెట్టాల్సిన అవసరం ఉంది. గడచిన ఐదేళ్లలో పారిశ్రామికంగా ఒక్కటంటే ఒక్క కంపెనీ జిల్లాకు వచ్చిన దాఖలాలే లేవు. జిల్లాలో దాదాపు 56 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉన్నా దీనిని ఉపయోగించుకోవడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తీరప్రాంతంలో పర్యాటకరంగం అభివృద్ధిపై శ్రద్ధపెడితే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది. వీటికి సంబంధించిన ప్రతిపాదనలపై కొత్త కలెక్టర్ దృష్టిపెట్టి ప్రభుత్వానికి నివేదిస్తే జిల్లాకు మేలు జరుగుతుందనేది పలువురి అభిప్రాయం.

అసైన్డ్ భూములను దోచేశారు....

అసైన్డ్ చట్ట సవరణ ద్వారా పేదలకు భూయాజమాన్య హక్కు కల్పించే నెపంతో ఆ భూములను వైసీపీ నేతలు చెరబట్టారనే ఆరోపణలు అప్పట్లో టీడీపీ చేసింది. ఇదే కాకుండా లంక భూముల పట్టాల విషయంలో గోల్‌మాల్ జరిగిందనే విమర్శలున్నాయి. ఈ రికార్డులను పరిశీలించి అనర్హులకు ఎవరికైనా మేలు జరిగి ఉంటే వాటిని రద్దు చేయాల్సిన బాధ్యత కొత్త కలెక్టర్‌పై ఉంది. బాపట్ల, చీరాల పరిధిలో 80 శాతం అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైనట్లు రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి.

రహదారులు.. రయ్‌రయ్

- కేంద్రమంత్రి గడ్కరీ హామీతో ముందడుగు
- వైసీపీ హయాంలో మూలనపడిన రోడ్లకు కదలిక

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అమరావతి అవుటర్ రింగురోడ్డు, చినకాకాని - పొట్టిపాడు హైవే, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న చినకాకాని - గుండుగొలను రోడ్లకు సంబంధించి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ హామీ ఇచ్చారు. జిల్లా రూపురేఖలు మార్చే కీలక జాతీయ రహదారులవి. వాటిల్లో ఒకటి ఇప్పటికే చివరి దశలో ఉండగా మరో రెండు ప్లానింగ్‌లో ఉన్నాయి. డీపీఆర్‌లు కూడా సిద్ధమయ్యాయి. ఈ మూడు జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి అయితే పారిశ్రామికంగా జిల్లా గణనీయమైన అభివృద్ధిని సాధిస్తుంది. వైసీపీ హయాంలో మూలనపడిపోయిన ఈ ప్రాజెక్టుల గురించి గురువారం సీఎం చంద్రబాబునాయుడు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో వాటి ప్రాధాన్యాన్ని వివరించి మంజూరు చేయించారు. రాబోయే ఐదేళ్లలో ఈ మూడు ప్రాజెక్టులు పూర్తి అయితే అమరావతి రాజధాని అభివృద్ధి శరవేగంగా ముందుకు సాగుతుంది. చినకాకాని - గుండుగొలను(విజయవాడ వెస్టు బైపాసు) జాతీయ రహదారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అప్పటి యూపీఏ-2 ప్రభుత్వ హయాంలో మంజూరైంది. అయితే పనులు గ్రౌండింగ్ చేయడానికి ఆలస్యమైంది. భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణం చేపట్టిన జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ వేగవంతంగా పూర్తి చేస్తున్నది. కృష్ణానదిపై భారీ వంతెనను నిర్మిస్తున్నది. అటు విజయవాడ, ఇటు గుంటూరు జిల్లాల వైపు రహదారి పనులను దాదాపుగా పూర్తి చేసింది. కొన్ని పెండింగ్ పనులపై దృష్టి సారించింది. మరోవైపు చినకాకాని - పొట్టిపాడు(విజయవాడ ఈస్టు బైపాసు రోడ్డు)కి సంబంధించి డీపీఆర్ మాత్రమే రూపుదిద్దుకొన్నది.

ఓఆర్‌ఆర్‌కి కేంద్రం సిద్ధం

అమరావతి రాజధాని మాస్టర్‌ప్లాన్‌లో అవుటర్ రింగురోడ్డుని ప్రతిపాదించారు. దీనిని కూడా కేంద్ర ప్రభుత్వమే నిర్మించేందుకు తాజాగా సుముఖత వ్యక్తపరిచింది. దాదాపుగా 190 కిలోమీటర్ల పొడవునా ఈ అవుటర్ రింగు రోడ్డుని ఇటు గుంటూరు, అటు కృష్ణా జిల్లాల్లో నిర్మించేందుకు ఎలైన్‌మెంట్ చేశారు. ఈ రోడ్డు జిల్లాలో ముత్తాయపాలెం, సత్తెనపల్లి, మందపాడు, పొత్తూరు, నారాకోడూరు, మున్నంగి మీదగా కృష్ణా జిల్లాలో కంకిపాడు, పొట్టిపాడు, ఆగిరిపల్లి, గంగినేని, కంచికర్ల వరకు నిర్మిస్తారు. ఇందుకోసం కృష్ణానదిపై రెండు భారీ బ్రిడ్జీలను నిర్మించాల్సి ఉంది. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రూ.17,761 కోట్ల నిధులు అవసరమౌతాయని అంచనా వేశారు.

బిజినెస్

మరింత సులభంగా ఎస్‌బీఐ రుణాలు

న్యూఢిల్లీ: రుణాల మంజూరు ప్రక్రియను ఎస్‌బీఐ మరింత సులభం చేసింది. బ్యాంకు 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇందుకోసం అనేక చర్యలు ప్రకటించింది. వ్యవసాయ రుణాల్లో ఉండే నష్ట భయాన్ని (రిస్క్) సరిగా అంచనా వేసి, వేగంగా రుణాలు మంజూరు చేసేందుకు కొత్తగా 35 కేంద్రీకృత వ్యవసాయ ప్రాసెసింగ్ సెల్స్ (ఏసీపీసీ) ఏర్పాటు చేసింది. మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల హామీపై రుణాల మంజూరు కోసం తన ఎండ్ టు ఎండ్ డిజిటల్ యాప్ యోనో, భీమ్ ఎస్‌బీఐ పే యాప్‌లో రెండు ప్రత్యేక ఫీచర్లు జోడించింది. ఎస్‌బీఐ సూర్య ఘర్ లోన్ మంజూరు ప్రక్రియనీ సులభతరం చేసింది. ప్రవాస భారతీయుల బ్యాంకింగ్ అవసరాలు తీర్చేందుకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంది.

బైజూస్ జీతాలు చెల్లించాల్సిందే

ఎన్‌సీఎల్‌టీ

బెంగళూరు: ఎడ్యు స్టార్టప్ బైజూస్‌కి ఎన్‌సీఎల్‌టీ బెంగళూరు బెంచ్ గట్టి హెచ్చరిక చేసింది. ముందు ఉద్యోగుల జీతాల బకాయిలు చెల్లించాలని ఆదేశించింది. లేకపోతే బైజూస్ ఆదాయ, వ్యయాల పుస్తకాలను ఐసీఏఐ ద్వారా ఆడిట్ చేయించాల్సి ఉంటుందని హెచ్చరించింది. రైట్స్ ఇష్యూ ద్వారా సేకరించిన 20 కోట్ల డాలర్లు తమకు అందుబాటులో లేనందున ఇప్పటికిపుడు ఉద్యోగుల జీతాలు చెల్లించడం సాధ్యం కాదన్న బైజూస్ వాదనని ఎన్‌సీఎల్‌టీ తోసిపుచ్చింది. బైజూస్ ఇప్పటికే నడుస్తున్న బిజినెస్ సంస్థ కాబట్టి, వచ్చే ఆదాయం నుంచి ఉద్యోగుల జీతాలు చెల్లించడం పెద్ద సమస్య కాదని స్పష్టం చేసింది.

పదేళ్ల గరిష్ఠ స్థాయిలో ఇళ్ల అమ్మకాలు

న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో గత ఆరు నెలల్లో 1,73,241 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడు పోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ. గత పదేళ్లలో ఎన్నడూ ఈ నగరాల్లో ఇన్ని ఫ్లాట్లు, ఇళ్లు అమ్ముడుపోలేదని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా ఒక నివేదికలో తెలిపింది.

హైదరాబాద్‌లో మరింత పైకి: హైదరాబాద్ రియల్టీ గత ఆరు నెలల్లో 18,573 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 21 శాతం ఎక్కువని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. ముంబై, ఢిల్లీతో సహా దేశంలో మరే ప్రధాన నగరంలోనూ ఇంత భారీ వృద్ధిరేటు నమోదు కాలేదు. ఆఫీసు స్పేస్ లీజుల విషయంలోనూ ఇదే పరిస్థితి. గత ఆరు నెలల్లో హైదరాబాద్‌లో 50 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీసు స్పేస్ కోసం లీజు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 71 శాతం ఎక్కువని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది.

మార్కెట్ దూసుకెళ్తోంది.. జర జాగ్రత్త!



సెబీ, శాట్‌కు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచన

మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని సలహా..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతున్న తరుణంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీతో పాటు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు (శాట్) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సూచించారు. అంతేకాదు, వ్యవస్థ సుస్థిరత కోసం శాట్ మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. మార్కెట్ లావాదేవీలు భారీగా పెరగడంతోపాటు ఎప్పటికప్పుడు కొత్త నిబంధనలు అమలులోకి తెస్తున్న నేపథ్యంలో ట్రిబ్యునళ్లపై పనిభారం గణనీయంగా పెరిగిందని, ఈ నేపథ్యంలో అధికారులు కొత్త బెంచ్‌లను ఏర్పాటు చేసే దిశగా ఆలోచించాలన్నారు. శాట్ కొత్త కార్యాలయంతోపాటు కొత్త వెబ్‌సైట్‌ను గురువారం ప్రారంభించిన సందర్భంగా చీఫ్ జస్టిస్ ఈ వ్యాఖ్యలు చేశారు. తమ పెట్టుబడులకు చట్టాలు రక్షణ కల్పించగలవని, వివాదాలను పరిష్కరించేందుకు సమర్థవంతమైన వ్యవస్థలున్నాయని ఎప్పుడైతే మదుపరులు భావిస్తారో.. వారు మార్కెట్లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలుంటాయని, అలాంటి వాతావరణం దేశంలో పెట్టుబడుల పెరుగుదలకు, ఉద్యోగాల కల్పనకు, ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. స్వలాభం కోసం ఒకరికొకరు హాని చేసుకునే ఆర్థిక ప్రపంచంలో శాట్ రిఫరీ పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. అందరూ నిబంధనలు పాటించేలా చూడాల్సిన బాధ్యత ఉంటుంది. మార్కెట్ సత్ప్రవర్తన, కార్పొరేట్ పాలన ప్రమాణాల అంశాలకు సంబంధించి శాట్ వద్ద అప్పీళ్లు కొన్ని రెట్లు పెరిగిన నేపథ్యంలో ట్రిబ్యునల్ సమర్థవంతంగా, పూర్తి సామర్థ్యంతో పనిచేసేందుకు శాట్‌లో ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని సూచించారు.

మోసగాళ్లపై సమాచారం ఇవ్వండి: బుచ్

మార్కెట్లో తప్పుడు పనులకు పాల్పడుతున్న వారి సమాచారం ఇవ్వాలని సెబీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మార్కెట్ వర్గాలను కోరారు. స్వప్రయోజనాల కోసం తప్పుగా ప్రవర్తించే వారిపై ఫిర్యాదు చేయాలన్నారు. ఏదైనా తప్పుడు ప్రవర్తన వ్యవస్థాగత సమస్యగా రూపుదాల్చకుండా, మరిన్ని కఠిన నిబంధనలు ప్రవేశపెట్టే అవసరం లేకుండా వీలైనంత త్వరగా చర్యలు చేపట్టడమే సెబీ ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.

కడప దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీలో కొత్త యూనిట్ ప్రారంభం

న్యూఢిల్లీ: దాల్మియా భారత్ ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో నిర్మించిన కొత్త యూనిట్‌లో వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభమయింది. ప్రస్తుతం ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 2.6 ఎంటీపీఏ కాగా కొత్త యూనిట్‌తో అదనంగా 1.0 ఎంటీపీఏ సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ విస్తరణతో తమ కంపెనీ మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 46.6 ఎంటీపీఏకు పెరుగుతుందని పేర్కొంది.

డీసీఐకి రూ.156.5 కోట్ల కాంట్రాక్టు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి (డీసీఐ) రూ.156.5 కోట్ల విలువైన కొత్త కాంట్రాక్టు లభించింది. కొచ్చిన్ పోర్టులో ఏటా నిర్వహించే డ్రెడ్జింగ్ పనుల కాంట్రాక్టును డీసీఐ దక్కించుకుంది. కాంట్రాక్ట్‌లో భాగంగా కొచ్చిన్ పోర్టు అవుటర్ ఛానల్, అప్రోచ్ ఛానల్, ఐసీటీటీ బేసిన్, ఎల్ఎన్‌జీ బేసిన్ ఛానల్‌లో డ్రెడ్జింగ్ పనులు చేపట్టాల్సి ఉంటుందని వివరించింది. మరో ఏడాది పొడిగించే నిబంధనపై ఈ కాంట్రాక్టు తమకు దక్కిందని డీసీఐ తెలియచేసింది.

2025 డిసెంబరు నాటికి సెన్సెక్స్ 1,00,000?

ఐదేళ్లకోసారి రెండింతలవుతున్న ఇండెక్స్

ముంబై: బీఎస్ఈ సెన్సెక్స్ గతంలో సాధించిన వృద్ధిని బట్టి చూస్తే, 2025 డిసెంబరు నాటికి 1,00,000 పాయింట్ల మైలురాయికి చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి. గడిచిన 45 సంవత్సరాల్లో సెన్సెక్స్ 15.9 శాతం సంచిత వార్షిక వృద్ధిరేటు (సీఏజీఆర్) నమోదు చేసుకుంది. 1979 ఏప్రిల్‌లో 100 బేస్ పాయింట్లతో ఏర్పాటైన సెన్సెక్స్, ఇప్పటివరకు 800 రెట్ల వృద్ధిని సాధించింది. 15.9 శాతం సీఏజీఆర్‌ను మున్ముందూ కొనసాగించగలిగితే వచ్చే ఏడాది డిసెంబరు నాటికల్లా లక్ష పాయింట్లకు చేరుకోగలదని ఓ ఆంగ్ల దినపత్రిక కథనం అంచనా వేసింది. స్వల్పకాలంలో ఒడుదుడుకులకు లోనైనప్పటికీ, దీర్ఘకాలికంగా చూస్తే మాత్రం సూచీలు వృద్ధి పథంలోనే పయనించనున్నాయని అంటోంది.

మార్కెట్ పర్యవేక్షణ కోసం కేబినెట్ మంత్రిని నియమించాలి..

సెన్సెక్స్ ప్రస్తుత 15.9 శాతం సీఏజీఆర్‌తో ప్రతి ఐదేళ్లకు రెట్టింపవుతూ వచ్చిందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఛైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ అన్నారు. ఇదే ట్రెండ్ కొనసాగితే, 2029 నాటికి సెన్సెక్స్ 1,60,000కు చేరుకోగలదని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాదు, దేశీయ క్యాపిటల్ మార్కెట్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కేబినెట్ సహాయ మంత్రిని నియమించాలని సూచించారు.

80,000 ఎగువన ముగిసిన సెన్సెక్స్

ముంబై: ఈక్విటీ సూచీలు గురువారం సరికొత్త ఉన్నత శిఖరాలకు చేరుకున్నాయి. క్రితం సెషన్‌లోనే 80,000 మైలురాయిని తాకి వెనక్కి వచ్చిన సెన్సెక్స్, తొలిసారిగా ఆ స్థాయికి ఎగువన ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరపడం ఇందుకు తోడ్పడింది. సెన్సెక్స్ ఒకదశలో 400 పాయింట్ల మేర ఎగిసి 80,392.64 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 62.87 పాయింట్ల లాభంతో మరో జీవితకాల గరిష్ఠ స్థాయి 80,049.67 వద్ద స్థిరపడింది. 24,401 వద్ద ఇంట్రాడే రికార్డును నమోదు చేసిన నిఫ్టీ చివరికి 15.65 పాయింట్ల లాభంతో 24,302.15 వద్ద సరికొత్త గరిష్ఠ ముగింపును సైతం రికార్డు చేసింది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ కూడా సరికొత్త గరిష్ఠ స్థాయి రూ.4,47,30,452.99 కోట్లకు (5.36 లక్షల కోట్ల డాలర్లు) దూసుకుపోయింది.

పదేళ్లలో ఫార్మా ఎగుమతులు 13,000 కోట్ల డాలర్లు

ప్రస్తుతం 2500 కోట్ల డాలర్లు; తెలంగాణ వాటా 35 శాతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత ఫార్మా ఎగుమతులు వచ్చే పదేళ్ల కాలంలో 13000 కోట్ల డాలర్లకు (రూ.10.85 లక్షల కోట్లు) చేరనున్నాయని ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఇప్కా) ప్రెసిడెంట్ డాక్టర్ బి.పార్థసారథి రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఫార్మా ఎగుమతుల పరిమాణం 2500 కోట్ల డాలర్లున్నదని (రూ.2.08 లక్షల కోట్లు), అందులో ఒక్క తెలంగాణ వాటానే 35 శాతం ఉందని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం నుంచి జరుగనున్న 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ (ఐపీసీ) వివరాలు తెలియచేయడానికి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ ఔషధ మార్కెట్‌కు భారత్ ఎన్నో కీలక ఔషధాలు అందిస్తున్నదని తెలిపారు. ప్రపంచ మార్కెట్లో భారత ఫార్మాను మరింత విస్తరించి, పటిష్ఠం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. ప్రపంచ ఫార్మా రంగ ప్రముఖులందరినీ ఒకే వేదిక పైకి తెచ్చి ఫార్మా రంగాన్ని మరింత ఉత్తేజితం చేయడమే లక్ష్యంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో ఐపీసీ నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రపంచంలోని భిన్న దేశాలకు చెందిన 12 వేల మంది ప్రతినిధులు, 74 మంది వక్తలు ఈ సదస్సుకు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. పది సంవత్సరాల తర్వాత ఇంత భారీ స్థాయిలో ఐపీసీ సదస్సు హైదరాబాద్ వేదికగా జరుగుతోందని ఆయన వెల్లడించారు.

ప్లేస్‌మెంట్ కాంక్లేవ్

ఫార్మా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కోసం ఐపీసీలో భాగంగా ప్లేస్‌మెంట్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్టు ఐపీఏ అధ్యక్షుడు టీవీ నారాయణ చెప్పారు. పలు ఫార్మా కంపెనీలు ఇందులో పాల్గొని విద్యార్థుల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని, అర్హులైన వారికి ప్లేస్‌మెంట్ లేఖలు కూడా అందచేయనున్నాయని ఆయన తెలిపారు. ఐపీసీలో ఇలాంటి ప్లేస్‌మెంట్ కాంక్లేవ్ నిర్వహించడం ఇదే ప్రథమమని చెప్పారు. అలాగే స్టార్టప్‌ల కోసం ప్రత్యేక సెషన్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. విద్యార్థులు తమ ఊహాత్మక ప్రాజెక్టులను ఇక్కడ ఆవిష్కరించినట్టయితే ఉత్తమ ఆవిష్కరణను కార్యరూపంలోకి తెచ్చేందుకు అవసరమైన ఆర్థిక సహాయం, అందచేయనున్నట్టు ఆయన చెప్పారు.

డబ్ల్యూహెచ్‌ఓ అభియోగంలో నిజం లేదు

భారతదేశంలో తయారవుతున్న ఔషధాల్లో 35 శాతం కల్తీ ఔషధాలే అన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికను ఐపీసీ ప్రతినిధులు ఖండించారు. తక్కువ ధరలో నాణ్యమైన ఔషధాల కోసం ప్రపంచం యావత్తు భారతదేశం వైపే చూస్తున్నదన్నారు. ప్రపంచ ఫార్మాగా ప్రసిద్ధి చెందిన మన దేశం కొవిడ్ సంక్షోభ కాలంలో 150 పైగా దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేసిందని, అలాగే ఎన్నో కీలకమైన వ్యాక్సిన్లు ప్రపంచానికి అందించి ప్రజల ప్రాణాలు కాపాడుతున్నదని గుర్తు చేశారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,090 ▲	67,000 ▲	97,500
ముంబై	72,470 ▲	66,380 ▲	90,020

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

5వ తేదీ

హైదరాబాద్	525	విజయవాడ	540
వరంగల్	527	గోదావరి	535
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	123
వరంగల్	112	గుంటూరు	123
కరీంనగర్	112	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	122
కర్నూలు	112	నెల్లూరు	122
విశాఖపట్నం	124	అనంతపురం	123
గోదావరి	123		



నవ్య | చిత్రజ్యోతి

వేడుకగా నటి వరలక్ష్మి వివాహ రిసెప్షన్

తరలివచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు







సినీ నటి వరలక్ష్మి, ముంబైకు చెందిన వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ల వివాహం రిసెప్షన్ బుధవారం రాత్రి చెన్నైలోని ఓ నక్షత్ర హోటల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు మంత్రి ఉదయనిధి, మలయాళ నటుడు, కేంద్రమంత్రి సురేష్ గోపి, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.అన్నామలై, టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్, మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం, మాజీ మంత్రి డి.జయకుమార్, శశికళతో సహా పలువురు రాజకీయ నేతలు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. చిత్రపరిశ్రమకు చెందిన సీనియర్ నటులు శివకుమార్, విజయకుమార్, నాజర్, నెపోలియన్, ప్రభుదేవా, ఆర్య, సిద్ధార్థ్, జీవా, అరవింద్ స్వామి, గౌతం కార్తీక్, మోహన్‌బాబు, సుదీప్, జాకీ ష్రాఫ్, తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన బాలకృష్ణ, వెంకటేష్, అల్లు అరవింద్, సినీ నటి ఖుష్బూ, ఆండ్రియా, సుకన్య, దేవయాణి, రమ్యకృష్ణ, రోజా, సుహాసిని, సీత, సంగీత దర్శకులు దేవ, శ్రీకాంత్ దేవా, తమన్, దర్శకులు భారతీరాజా, ఎస్ఏ చంద్రశేఖరన్, మణిరత్నం, కేఎస్ రవికుమార్, పి.వాసు, బాలా, సురేష్ కృష్ణ, ఆర్కే సెల్వమణి, చేరన్, ఐశ్వర్య రజనీకాంత్, ఎ.వెంకటేశ్, ఏఎల్ విజయ్, అట్లీ, వసంత్‌బాలన్, నిర్మాతలు ఆర్‌బీ చౌదరి, ఏఎం రత్నం, ఐసరి కె.గణేష్‌తో పాటు అనేక మంది పాల్గొన్నారు. వివాహానికి ముందు జరిగిన సంగీత్ కార్యక్రమంలో సూపర్‌స్టార్ రజనీకాంత్, నటి త్రిష పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

- చెన్నై, (ఆంధ్రజ్యోతి)

డబ్బింగ్ పనుల్లో విశ్వంభర



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర'. ఈ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్‌కు 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. గురువారం ఈ సినిమా డబ్బింగ్ పనులు మొదలయ్యాయి. అత్యున్నత స్థాయి వీఎఫ్ఎక్స్‌తో తెరకెక్కుతోన్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో హనుమంతుడి భక్తుడిగా చిరంజీవి కనిపించనున్నారు. ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: చోటా.కె.నాయుడు, సంగీతం: ఎమ్.ఎమ్.కీరవాణి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/nDerGdD లో చదవండి.

సమస్యలివి... పరిష్కారాలేవి?

నంది అవార్డులు ఏవీ?

ఒకప్పుడు నంది అవార్డుల ఉత్సవమంటే సినిమావాళ్లకు ఓ పండుగ! అవార్డుల ప్రదానోత్సవాలు కూడా అంత ఘనంగా జరిగేవి. నటులకు ప్రోత్సాహకంగా ఉండేది. రెండు రాష్ట్రాలు విడిపడిన తర్వాత నంది అవార్డుల ప్రస్తావనే లేదు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో 'సింహ' పేరుతో చిత్ర పరిశ్రమకు అవార్డులు ఇస్తామని ప్రకటించింది. అవార్డుల కోసం ఎంట్రీలు కూడా స్వీకరించింది. కానీ ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ పదేళ్ల నుంచి తెలంగాణలో అవార్డుల ఊసే లేదు.

ఆంధ్రాలో పరిస్థితీ అంతే

ఆంధ్రప్రదేశ్‌లో ఇంతకుముందు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో మూడేళ్ల కాలానికి సంబంధించి ఒకేసారి కమీటీలు వేసి, నంది అవార్డులు ప్రకటించింది. అంతకుముందు రెండేళ్లుగా కూడా నంది అవార్డులు ఇవ్వకపోవడంతో ఒకేసారి వేడుక నిర్వహించి మొత్తం ఐదేళ్ల కాలానికి ఒకేసారి నంది అవార్డులు ఇవ్వాలని ప్లాన్ చేసింది. ఇంతలో ఎన్నికలు జరిగి చంద్రబాబు ప్రభుత్వం అధికారం కోల్పోయి, జగన్ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించింది. ఆయన నంది అవార్డుల గురించి పట్టించుకోనే లేదు. ఇటీవల తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం నంది అవార్డుల పేరు మార్చి.. గద్దర్ పేరిట సినిమాలకు అవార్డులు ఇస్తామని ప్రకటించింది. అయితే ఆ తర్వాత దీని గురించి ప్రాథమికంగా కూడా చర్చ జరిగిన దాఖలాలు లేవు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలు కలిపి కానీ, విడివిడిగా కానీ చిత్ర పరిశ్రమకు అవార్డులు ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని చిత్ర పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

పరిశ్రమగా గుర్తించాలి

సినిమాను ఒక పరిశ్రమగా గుర్తించాలనే డిమాండ్ చిరకాలంగా ఉంది. అలా చేయడం వల్ల అనేక రాయితీలు లభిస్తాయి. ఫలితంగా చిత్ర నిర్మాణ వ్యయం తగ్గుతుంది. థియేటర్లు నిర్వహించేవారికి వెసులుబాటు కలుగుతుంది. ఖర్చులు కలసి వస్తాయి. రాయితీల కారణంగా చిత్ర నిర్మాణాల సంఖ్య పెరిగి ప్రభుత్వానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆదాయం పెరుగుతుంది.

టికెట్ ధరల తికమక

సినిమా టికెట్ ధరలు పెంచే అధికారం ప్రభుత్వాలకు ఉంది. చిత్ర నిర్మాణ వ్యయం అంచనాలకు మించి పెరిగిన నేపథ్యంలో పెట్టిన ఖర్చు తిరిగి రాబట్టుకోవడానికి టికెట్ ధరలు పెంచుకోవడానికి భారీ చిత్ర నిర్మాతలు విడుదలకు ముందు ప్రభుత్వాలను అభ్యర్థించడం ఇటీవలి కాలంలో ఓ అలవాటుగా మారింది. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం- రూ. వంద కోట్ల బడ్జెట్ దాటిన సినిమాలకు ధరలు పెంచుకోవటానికి అనుమతి ఇస్తామని ప్రకటించింది. అయితే కొన్ని సార్లు బడ్జెట్ ఎక్కువ అయినా నిర్మాతలు ఖర్చును తక్కువగా చూపిస్తారు. దీని వల్ల గత ఏడాది రెండు పెద్ద సినిమాలు తీవ్రంగా నష్టపోయాయి. అంతే కాకుండా ఎంత కాలం సినిమా టికెట్ ధరలు పెంచుకోవచ్చనే విషయంపై కూడా అస్పష్టత ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా కల్కి సినిమాకు 14 రోజులు ధర పెంచటానికి ఇచ్చిన జీఓపై కేసు ప్రస్తుతం హైకోర్టులో ఉంది. కొన్ని సినిమాలకు తెలంగాణ ప్రభుత్వం టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చినా , ఆంధ్రా ప్రభుత్వం మొండిచేయి చూపించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల రెండు రాష్ట్రాలు కలిపి టిక్కెట్ల ధర విషయంలో ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటిస్తే బావుంటుందని సినీ వర్గాలు కోరుకుంటున్నాయి. ఇదే విధంగా బుక్‌మై షో వంటి యాప్‌లకు ప్రేక్షకులు అదనంగా సర్వీస్ టాక్స్ చెల్లించాల్సి వస్తోంది. ఉదాహరణకు 250 రూపాయల టికెట్ ధరకు అదనంగా సుమారు 49 రూపాయలు బుక్‌మై షో కు చెల్లించాల్సి వస్తోంది. ఇలా కాకుండా ప్రభుత్వమే టికెట్లు విక్రయించే విధంగా యాప్‌లను అభివృద్ధి చేస్తే బావుంటుందంటున్నారు. జగన్ ప్రభుత్వం ఈ తరహా యాప్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటన చేసింది. కానీ ఇది కార్యరూపం దాల్చలేదు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

చిన్న సినిమాలూ బతకాలి!


ప్రతి ఏడాది తెలుగులో సుమారు 100 సినిమాలు విడుదల అవుతుంటాయి. వాటిల్లో పది నుంచి పదిహేను మాత్రమే పెద్ద సినిమాలు ఉంటాయి. అందుకే చిన్న సినిమాలు బతకాలంటే వాటికి ప్రత్యేకంగా రాయితీలు ప్రభుత్వ పరంగా ప్రకటించాలనే డిమాండ్ చిరకాలంగా ఉంది. ఈ విషయమై ప్రభుత్వంతో చర్చలు కూడా జరిగాయి. కానీ వాటిల్లో పురోగతి లేదు. థియేటర్లు దొరక్క ఇబ్బంది పడుతున్న చిన్న చిత్రాల నిర్మాతలను ఆదుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చి ఐదో ఆటగా చిన్న సినిమాను ప్రదర్శించుకోవడానికి అనుమతి ఇస్తామని ప్రకటించింది. కానీ అది అమలుకు నోచుకోలేదు. ఈ విషయం మీద కూడా తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. అలాగే రాష్ట్రం విడిపోక ముందు సందేశాత్మక, ప్రయోగాత్మక చిత్రాలకు పది లక్షల రూపాయలు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందించేది. ఆ తరహా చిత్రాలు నిర్మించే నిర్మాతలకు ఇది ఉపయుక్తంగా ఉండేది. అటువంటి విధానాన్ని మళ్లీ చేపట్టాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.

డిజిటల్ చార్జీలు కంట్రోల్ చేయలేమా?

ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలుగు రాష్ట్రాల్లోనే క్యూబ్(డిజిటల్ ఫార్మాట్‌లో చిత్రాల ప్రదర్శన) చార్జీలు ఎక్కువ. గతంలో ప్రింట్ల విధానం ఉండేది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని థియేటర్లు డిజిటలైజ్ అయ్యాయి. దీని వల్ల ప్రేక్షకుల సంఖ్యతో నిమిత్తం లేకుండా- ఒక షో వేస్తే క్యూబ్‌కు కూ. 6500 చెల్లించాల్సిందే. ముఖ్యంగా సింగిల్ థియేటర్ యజమానులు ఈ పద్ధతి వల్ల చాలా నష్టపోతున్నారు. డిజిటల్ ఛార్జీల విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే సింగిల్ థియేటర్లకు మేలు జరుగుతుంది. . లేకపోతే నష్టాలు భరించలేక ఎక్కువ థియేటర్లు కల్యాణ మండపాలుగానో.. షాపింగ్ మాల్స్‌గానో మారిపోయే అవకాశముంది.

ప్రభుత్వానికి అండగా నిలుస్తాం

సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణలో టాలీవుడ్ చిత్ర పరిశ్రమ అన్ని వేళలా తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలుస్తుందని టీఎఫ్‌సీసీ (తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్) తెలిపింది. ఈ మేరకు టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు దిల్‌రాజు, కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్, కే శివప్రసాదరావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలోనూ పలు సందర్భాల్లో చిత్ర పరిశ్రమ ప్రభుత్వానికి అండగా నిలిచింది, ఇకపైనా తెలంగాణ ప్రభుత్వానికి అండగా ఉంటామని తెలిపింది. డ్రగ్స్, సైబర్ నేరాల కట్టడిలో నటీనటులు, దర్శక నిర్మాతలు, పంపిణీదారులు, థియేటర్స్ యాజమాన్యాలు తమవంతు సహకారాన్ని అందిస్తారు, దీనిపై త్వరలో ముఖ్యమంత్రిని కలసి చర్చిస్తాం' అని టీఎఫ్‌సీసీ తెలిపింది.



'జాయింట్ నంది అవార్డ్స్'...

తెలుగు సినీ రంగానికి సంబంధించి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో పైరసీ సమస్య ఒకటి. మరొకటి టికెట్ రేట్లు. అలాగే విద్యుత్ చార్జీలు కూడా తగ్గిస్తే.. పరిశ్రమకు మేలు జరుగుతుంది. తెలుగు సినీ రంగానికి తోడ్పడేలా ఇరు రాష్ట్ర ముఖ్యమంత్రులు కలిపి 'జాయింట్ నంది అవార్డ్స్' ప్రకటిస్తే బాగుంటుంది. ఒక సంవత్సరం హైదరాబాద్‌లో, ఇంకో సంవత్సరం అమరావతిలో ఆ వేడుకలను జరపాలి. ఇలా చేస్తే తెలుగు సినిమాకు.. తెలుగు వారికి మరింత ప్లస్ అవుతుంది.

- డి.సురేశ్‌బాబు, నిర్మాత

నంది అవార్డులను పునరుద్ధరిస్తే బాగుంటుంది



రాష్ట్రాలు రెండే కాని.. తెలుగు సినిమా రెండు రాష్ట్రాల్లోనూ ఆడుతోంది. గత ప్రభుత్వాలతో పోల్చితే ప్రస్తుతం అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులు సినీరంగ అభివృద్ధికి, తోడ్పాటుకు సుముఖంగా ఉన్నారు. ఇద్దరు ముఖ్యముంత్రులు కలసి మళ్లీ నంది అవార్డులను పునరుద్ధరిస్తే బాగుంటుంది. ఈ నిర్ణయం తెలుగు ప్రజలకు ఆనందం కలిగిస్తుంది. రేపు ముఖ్యమంత్రులిద్దరూ కలసి చర్చలు జరిపే నేపథ్యంలో ఇరు రాష్ట్రాలకు సంబంధించిన కళాకారులకు ఏదో ఒక పేరుతో అవార్డులు ప్రకటిస్తే బాగుంటుంది.

- ఎస్.వీ.రామారావు, సినీ చరిత్రకారుడు

రిమాండ్ ఖైదీకి బెయిల్ ఖైదీ పరామర్శ !

- 11కు పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదు
- వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాడు
- పిన్నెల్లి సోదరుల పరారీలో జగన్‌ను విచారించాలి
- మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం


మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 4: 'ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా నీకు బుద్ధి రాలేదా జగన్' అంటూ మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నెల్లూరు సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించిన అనంతరం జగన్ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి స్పందించారు. జగన్ చేసిన వ్యాఖ్యలు సత్యదూరమన్నారు. రిమాండ్ ఖైదీని బెయిల్‌పై ఉన్న ఖైదీ పరామర్శించి ఓదార్చుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా ప్రజలు బుద్ధి చెప్పినా వైసీపీ నేతల్లో మార్పు రాలేదన్నారు. మాచర్ల నియోజకవర్గంలో మారణహోమం సృష్టించినప్పుడు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న జగన్ స్పందించలేదని, ఇప్పుడు రామకృష్ణారెడ్డిని పరామర్శించడంపై పల్నాడులో ఘర్షణల వెనుక ఆయన హస్తం ఉందన్న స్పష్టమవుతోందన్నారు. చట్టం తనపని తాను చేసుకుంటూ పోతుందని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష పడుతుందని అధికారంలో ఉన్నప్పుడు నువ్వు పలికిన చిలక పలుకులు ఏమయ్యాయి జగన్ అంటూ ఎద్దేవా చేశారు. పోలీసుశాఖలో వారికి అనుకూలంగా ఉండే ఉన్నతాధికారి సహకారంతో పిన్నెల్లి సోదరులు పరారయ్యారని, ఇప్పుడు జగన్ పరామర్శతో అది రుజువైందని అన్నారు. వైసీపీ హయాంలో పెట్టిన తప్పుడు కేసులపై స్పందించని జగన్ ఇప్పుడు రామకృష్ణారెడ్డిని వెనకేసుకొని రావడం వైసీపీ విధానం అర్థమవుతుందన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే అర్ధరాత్రి అరెస్టులు చేయించిన విషయాన్ని మర్చిపోయావా జగన్ అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో పోలింగ్ బూతులోని మహిళా ఏజెంట్‌పై దాడి చేయటం, ఈవీఎం ధ్వంసం, అడ్డుకోబోయిన ఏజెంట్‌పై దాడి చేయించి తీవ్రంగా గాయపరచడం, మహిళను దుర్భాషలాడడం చేసిన వ్యక్తి నీకు సుద్ధపూసలా కనిపిస్తున్నాడా?, ప్రజలు నిన్ను, నీ మాటలను ఇక ఎంతమాత్రం నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు.

గుడ్లు బొక్కేసిన జగన్ మామ

- గుడ్లు, చిక్కీల కాంట్రాక్టర్లకు రూ.178.5 కోట్ల బకాయిలు
- పలు పాఠశాలల్లో గుడ్ల సరఫరా నిలిపివేత
- చిన్నారుల పౌష్టికాహారానికీ ఎసరు పెట్టిన వైసీపీ
- మంత్రి లోకేశ్ సమీక్షలో విస్తుగొలిపే వాస్తవాలు వెలికి


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

గుంటూరు(కార్పొరేషన్), జూలై 4 : మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన ఉండదని మరోమారు తేటతెల్లమైంది. చిన్నారులకు మేనమామలా ఉండి వారి యోగక్షేమాలు చూసుకుంటానని చెప్పిన నాటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి వాస్తవానికి విద్యార్థులు, చిన్నారులకు తీరని ద్రోహం చేశారు. మధ్యాహ్నభోజన పథకం అమలుపై సంబంధిత అధికారులతో గురువారం సెక్రటేరియట్‌లో నిర్వహించిన సమీక్షలో చేదు నిజాలు వెల్లడయ్యాయి.

గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఇవ్వాల్సిన గుడ్డును ఇవ్వడంలేదని మంత్రి లోకేశ్ దృష్టికి వచ్చింది. దీనిపై ఆయన వెంటనే స్పందించి గురువారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థులకు గుడ్లపంపిణీ నిలిపివేతకు గత ప్రభుత్వ నిర్వాకమే కారణమని స్పష్టమైంది. రాష్ట్రవ్యాప్తంగా కోడి గుడ్ల కాంట్రాక్టర్లకు డిసెంబర్ నుంచి రూ.112.5 కోట్లు, చిక్కీల కాంట్రాక్టర్లకు గత ఏడాది ఆగస్టు నుంచి రూ.66కోట్ల మేర జగన్ ప్రభుత్వం బకాయిలు పెట్టి వెళ్లిపోయింది. భారీగా బిల్లులు బకాయి పడటంతో గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని పలు పాఠశాలలకు గుడ్లు సరఫరాను ఆ కాంట్రాక్టర్ నిలిపివేశారు.

బకాయిలు చెల్లిస్తాం.. సరఫరా ఇవ్వండి

వాస్తవం ఇలా ఉంటే టీడీపీ ప్రభుత్వం వచ్చాక విద్యార్థులకు గుడ్ల పంపిణీ నిలిపివేశారంటూ వైసిపికి చెందిన నీలిమీడియా తప్పుడు ప్రచారం మొదలెట్టింది. విషయం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ దీనిపై సమీక్ష నిర్వహించి, గుడ్లు, చిక్కీలకు గత ప్రభుత్వం భారీగా బకాయిలు పెట్టి వెళ్లడంపై విస్మయం వ్యక్తం చేశారు. చిన్నారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా గుడ్లు, చిక్కీలను పంపిణీ చేయాలని, గత ప్రభుత్వం వదిలేసి వెళ్లిన బకాయిలను అతిత్వరలో చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. సమీక్షలో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, మధ్యాహ్న భోజనపథకం డైరెక్టర్ బీ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇటీవల విద్యాశాఖపై మంత్రి లోకేశ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించగా గత ప్రభుత్వం విద్యాదీవెన, వసతిదీవెన పథకాల కింద రూ.3,480 కోట్లు బకాయి పెట్టడంతో వారి సర్టిఫికెట్లు విద్యా సంస్థల్లో నిలిచిపోయినట్లు తెలిసింది. విద్యార్థులు, చిన్నారులను అవస్థల పాల్జేసిన మేనమామ అంటూ లోకేశ్ అభిప్రాయపడ్డారు.

మాజీ ఎమ్మెల్యే పీఆర్కేను కస్టడికి ఇవ్వండి

- మాచర్ల కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు
- ఐదు గంటలపాటు కోర్టులో వాదనలు
- తీర్పు నేటికి వాయిదా

మాచర్లటౌన్, జూలై 4: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని తమ కస్టడికి అప్పగించాలని కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు గురువారం మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సాయంత్రం 4:30 నుంచి రాత్రి 9:30 గంటల వరకు దీనిపై వాదోపవాదనలు జరిగాయి. పోలీసుల కస్టడికి ఇస్తే మాచర్ల నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన ఘర్షణలకు సంబంధించి నిందితులను పట్టుకునేందుకు అవకాశం ఉంటుందని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల తరుపున న్యాయవాదులు ఏపీపీ రవీంద్రకుమార్, అశ్విన్‌కుమార్ తమ వాదనలు వినిపించారు. మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తరుపున హైకోర్టు న్యాయవాదులు బాలసత్యానారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డిలు తమ వాదనలు వినిపించారు. ఐదు గంటలపాటు వాదనలు జరిగాయి. న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును శుక్రవారంనకు వాయిదా వేశారు.



అల్లూరి సీతా రామరాజు చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న డీజీపీ ద్వారకా తిరుమల రావు

మహనీయులను స్మరించుకోవడం మన కర్తవ్యం

- డీజీపీ ద్వారకా తిరుమలరావు
- అల్లూరి జయంతి సందర్భంగా ఘన నివాళులు

గుంటూరు, జూలై 4: దేశాన్ని, ధర్మాన్ని కాపాడేక్రమంలో సర్వ స్వాన్ని త్యాగంచేసిన మహనీయు లను గుర్తుచేసుకోవడం మనందరి కర్తవ్యమని డీజీపీ ద్వారకా తిరు మలరావు అన్నారు. గురువారం మన్యంవీరుడు అల్లూరి సీతారా మరాజు జయంతి సందర్భంగా పోలీసు ప్రధాన కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివా ళులర్పించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ కాలంలో మన్య ప్రాంత ప్రజలపై బ్రిటిష్ పాలకుల దోపిడీ, అణిచివేత, నిరం కుశత్వం పెచ్చుమీరుతున్న తరుణంలో అల్లూరి సీతారామారాజు ఆ ప్రజలకు అండగా నిలిచాడని, వారితో బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాన్ని నిర్మించాడని కీర్తిం చారు. ఆపోరాటంలో చివరకు తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించాడని అన్నారు. అటువంటి దేశభక్తి గల త్యాగధనుల జీవితాలు నేటి యువతకు ఎంతో ఆదర్శప్రాయమని డీజీపీ తిరుమలరావు తెలిపారు.

సఫాయి కర్మచారుల స్థితిగతులను మెరుగుపర్చాలి

- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా
- జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న డాక్టర్ పీపీ వావా, కలెక్టర్ నాగలక్ష్మీ

గుంటూరు,(తూర్పు), జూలై 4: జిల్లాలో సఫాయి కర్మచారుల జీవన స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు, వారి సామాజిక, ఆర్థిక పునరావాస కార్యక్రమాలను సక్రమంగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా జిల్లా ఉన్నతాధికారులకు సూచించారు. గురువారం గుంటూరు కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో ఆయన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీతో కలసి సఫాయి కర్మచారీలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రజారోగ్య విభాగాలలో పనిచేస్తున్న సఫాయి కర్మచారులకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై సాంఘీక సంక్షేమశాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కమిషన్ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పీపీ వావా మాట్లాడుతూ మాన్యువల్ స్కావెంజర్స్‌ను 2013లో ప్రభుత్వం రద్దు చేసిందని, ఎక్కడైనా మాన్యువల్ స్కావెంజర్స్ పని చేస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత యాజమాన్యలకు మొదటి విడతగా జరిమానా వేయటంతో పాటు చట్టప్రకారం శిక్షలు విధించటం జరుగుతుందన్నారు. పారిశుధ్య పనులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల పరిహారాన్ని సుప్రీంకోర్టు రూ.30 లక్షలకు పెంచాలని ఆదేశాలు జారీ చేసిందని, వీటితో పాటు కుటుంబ సభ్యులకు ఇతర ప్రయోజనాలు కల్పించిందన్నారు. సఫాయి కర్మచారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించటానికి కేంద్ర ప్రభుత్వం 85 స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటుకు ఎటువంటి ష్యూరిటీలు లేకుండా రుణాలు ఇవ్వాలని బ్యాంకులను ఆదేశించిందన్నారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ మాట్లాడుతూ జిల్లాలో సఫాయి కర్మచారుల సంక్షేమ కార్యక్రమాలను సక్రమంగా అమలు జరుగుతున్నాయని, మాన్యువల్ స్కావెంజర్స్ ఎక్కడ జరగటంలేదని, పారిశుధ్య పనుల నిర్వహిస్తూ సఫాయి కర్మచారులు మరణాలు జరగలేదని కలెక్టర్ నాగలక్ష్మి వివరించారు.

సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఏ.గాయత్రిరాణి, ఎస్సీ కార్పోరేషన్, ఈడీ ప్రేమకుమారి, డీపీవో శ్రీదేవి, డీఎంహెచ్‌వో కే.విజయలక్ష్మీ నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగి హఠాన్మరణం


ఆర్మీ ఉద్యోగి షేక్.రజ్జుబాషా (ఫైల్)

బాపట్ల, జూలై 4 : బాపట్ల పట్టణంలోని భావపురి కాలనీకి చెందిన ఇండియన్ ఆర్మీ ఉద్యోగి షేక్ రజ్జుబాషా(42) జమ్మూకాశ్మీర్‌లో బుధవారం రాత్రి హఠాన్మరణం చెందారు. రజ్జుబాషా గత 22 సంవత్సరాలుగా ఆర్మీలో వివిధ హోదాలలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం హవల్దార్‌గా జమ్మూకాశ్మీర్‌లోని రిజౌరి సెక్టార్‌లో పనిచేస్తున్న ఆయన విధి నిర్వహణలో ఉండగా గుండెపోటు రావటంతో మృతి చెందినట్లు సమాచారం. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు, తల్లి ఉన్నారు. రజ్జుబాషా భౌతికకాయం శుక్రవారం ఉదయం బాపట్లకు వచ్చే అవకాశం ఉందని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు తెలిపారు. రజ్జుబాషా భౌతిక కాయానికి అధికార లాంఛనాలతో అంత్యక్రియులు జరపనున్నట్లు తెలిపారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో

సూత్రదారులు, పాత్రదారుల గుర్తింపు

- నిందితుల కోసం పోలీసుల ముమ్మర గాలింపు
- అజ్ఞాతంలోకి ముఖ్యులు.. పరారీలో పలువురు
- ఇప్పటికే పోలీసుల అదుపులో కొందరు..

గుంటూరు, జూలై 4 : మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నిందితుల కోసం పోలీసులు వేట ముమ్మరం చేశారు. ఈ కేసులో సూత్రదారులు, పాత్రదారులు ఎవరనే దానిపై పోలీసులకు స్పష్టత రావడంతో అరెస్టుల పర్వానికి తెరతీసారు. దీంతో కీలక వ్యక్తులు ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లారు. సూత్రదారుల్లో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్, మాజీ ఎంపీ నందిగం సురేష్ తదితరులు ఉన్నట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. అయితే పార్టీ కార్యాలయంపై దాడికి ఆదేశాలు ఇచ్చింది ప్రభుత్వ సలహాదారు అని పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో పోలీసులు ఆ దిశగా సాంకేతిక పరమైన ఆధారాలు సేకరించే పనిలో ఉన్నారు. మరోవైపు పాత్రదారుల్లో కీలకమైన వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నేత పానుగంటి చైతన్య ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లారు. అయితే చైతన్య ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. చైతన్యతో పాటు మరికొందరు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, రౌడీషీటర్లు, మాజీ రౌడీషీటర్లు ఈ దాడిలో ఉత్సాహంగా పాల్గొనగా వారి మాటలు విని నగరానికి చెందిన యువకులు, విద్యార్థులు, ఆటోడ్రైవర్‌లు, కూలి పనులు చేసుకునే వారు, గంజాయి ముఠాలు ఈ దాడిలో పాల్గొన్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. అరెస్టుల పర్వం మొదలైనప్పటి నుంచి దాడిలో పాల్గొన్న వ్యక్తుల్లో కొందరు అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆయా నాయకుల మాట విని దాడిలో పాల్గొన్న విద్యార్థుల్లో ఇప్పుడు ఆందోళన మొదలైంది. అన్యాయంగా తీసుకు వెళ్ళి మా పిల్లల భవిష్యత్ నాశనం చేసారని వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులు గుర్తించిన నిందితుల జాబితాలో కొందరు...

ఈ కేసులో ప్రధాన నిందితులుగా పోలీసులు పానుగంటి చైతన్య, ఏఆర్ రబ్బాని, బోడపాటి కిషోర్, మార్కెట్ బాబు, గేదెల రమేష్, వల్లెపు మహేష్, వీరారెడ్డి, లింగారెడ్డి, సుభాని, రామకృష్ణ, రమేష్, ఆజాం, ఉపేంద్ర, స్థంబాలగరువుకు చెందిన చల్లా శివకోటి, వెంగళరావునగర్‌కు చెందిన బొక్కా విఠల్, ధూపాటి నాని, నెహ్రూనగర్‌కు చెందిన సీహెచ్ వినోద్, బొంగరాలబీడుకు చెందిన షేక్ బాజి, బ్రాడీపేటకు చెందిన రవీంద్ర గురుశెట్టి, మల్లెల రామకృష్ణ, రామిశెట్టి విశాల్, అరుణ్‌కుమార్ (బాబు), ప్రవీణ్(చిల్లు), దేవాపురంనకు చెందిన నల్లగంటి శ్రీను(గంటి), వెంకట్రావు (మొద్దు), ఏటీ అగ్రహారంనకు చెందిన దేవదానం, పట్టాభిపురంనకుచెందిన జగదీష్ (జగత్ నాయుడు), పేరూరి అజయ్, మారుతీనగర్‌కు చెందిన షేక్ మస్తాన్, ఆర్టీసీ కాలనీకి చెందిన సీహెచ్ వినోద్‌కుమార్, పాత గుంటూరుకు చెందిన కొండూరి మహేష్, షేక్ వలితో పాటు పలువురు కార్పొరేటర్లు, మరికొందరు షాడో కార్పొరేటర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరి ఆధ్వర్యంలో దాడి జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. నిందితులలో అత్యధిక మంది మూడు, నాలుగు రోజుల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లిపోగా, మంగళ వారం అర్ధరాత్రి ఐదుగురు నిందితుల అరెస్టుతో మిగిలిన వారంతా బుధ వారం నుంచి అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం దాడి చేసిన నిందితులందరినీ గుర్తించి వారి చిరునామాలను తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ముందుగా బుధవారం అరెస్ట్ చేసిన ఐదుగురు నిందితుల నుంచి మరికొంత మంది నిందితుల వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది.

నిందితుల్లో అలజడి.. టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన కేసులో నిందితుల్లో అలజడి నెలకొంది. దీనిలో భాగంగా బుధవారం ఐదుగురు నిందితులను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేసిన విషయం విధితమే. దీంతో పార్టీ కార్యాలయంపై దాడిలో పాల్గొన్న నిందితులలో వణుకు మొదలైంది. అయితే పోలీసులు ఎవరెవరిని గుర్తించారు అనేది వారికి అంతుపట్టడం లేదు. దీంతో పోలీసులు గుర్తించిన జాబితాలో తాను ఉన్నానా లేదా అని ఎవరికి వారు హైరానా పడుతున్నారు. దీంతో ఆయా అనుమానితులంతా ఇళ్లకు రాకుండా వేర్వేరు చోట్ల తలదాచుకొని పరిస్థితిలను గమనిస్తున్నారు.

ఆయా వాహనాలు సీజ్ చేసేనా ?

టీడీపీ కార్యాలయంపై దాడికి సంబంధించిన కేసులో నిందితులు వినియోగించిన కార్లను కూడా సీజ్ చేస్తారా ? లేదా అనేది ప్రశ్నార్థకంగా ఉంది. దాడికి పాల్పడిన సందర్భంలో ఉపయోగించిన కూడా సీజ్ చేయాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు.

పింఛన్ పంపిణీలో వీఆర్వో చేతివాటం

- వృద్ధురాలికి రూ. వెయ్యి తగ్గించి వచ్చిన వైనం
- అధికారులకు తెలియడంతో తిరిగిచ్చేస్తానంటూ ప్రాదేయం..

బాపట్ల, జూలై4: వేమూరు సమీపంలోని ధర్మపురంలో పింఛన్ పంపిణీలో వీఆర్వో చేతివాటం ప్రదర్శించింది. వివరాల్లోకి వెళితే.. ఈనెల 1న పింఛన్లు పంపిణీ చేసేందుకు వీఆర్వో సామ్రాజ్యం తన కుమారుడిని వెంట పెట్టుకుని ధర్మపురంలోనికి వెళ్లింది. మున్నంగి సాయమ్మ అనే వృద్ధురాలికి రూ.6 వేలు పింఛన్ ఇచ్చింది. తనకు రూ.7 వేలు రావాలి కదా? రూ.6 వేలే ఇచ్చావేంటని ఆ వృద్ధురాలు ఆ వీఆర్వోను ప్రశ్నించింది. నీది వృద్ధాప్య పింఛన్ కింద లేదని, వికలాంగ పెన్షన్ కింద మారిందని అంటూ బుకాయించి చెప్పి ఆమె వెళ్ళిపోయింది. ఈ విషయాన్ని గురువారం ఆ వృద్ధురాలు ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్ళగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్వో సామ్రాజ్యం గురువారం రాత్రి సాయమ్మ ఇంటికి వెళ్ళి నీ వద్ద తీసుకున్న రూ.1000 తిరిగిచ్చేస్తాను ఎవ్వరికి చెప్పవద్దంటూ ప్రాదేయ పడింది.

ఐటీఐలో ప్రాంగణ ఎంపికలు

తెనాలి అర్బన్, జూలై 4 : తెనాలి ఐటీఐలో గురువారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. 22 కంపెనీల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. అమరాన్ బ్యాటరీస్, ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, ఐటీసీ, టీవీఎస్, టాటా, జోసిల్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 350 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ రావి చినవెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్ రాజేంద్రప్రసాద్,ఇమ్మానుయేలు పాల్గొన్నారు.


అమెరికాలో మెరిసిన తెలుగు తేజం

- పరిశోధనకుగాను పేటెంట్ హక్కు లభ్యం
- ఈఎస్‌డీ ప్రొటక్షన్ కోసం ఎస్‌సీఆర్ డివైస్ రూప కల్పనకు కృషి


క్రాంతి నాగోతు

నకరికల్లు, జూలై 4 : అమెరికాలో తెలుగు తేజం మెరిసింది. తన బృందం ఆవిష్కరణకు అమెరికా ప్రభుత్వం పేటెంట్ ఇచ్చింది. పల్నాడుజిల్లా నకరికల్లు మండలం తురకపాలెం గ్రామానికి చెందిన క్రాంతి నాగోతుతో పాటు జేమ్స్‌పాలు, రాజ్‌కుమార్‌ల ముగ్గురు సభ్యులతో కూడిన బృందం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎస్‌సీఆర్ డివైస్‌ను రూపొందించారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో వినియోగించే ఈఎస్‌డీ రక్షణ కోసం వీరు కనుగొన్న ఎస్‌సీఆర్ డివైస్ టెక్సాస్ ఇనుస్ట్రుమెంట్ ఇన్ కార్పోరేట్ సంస్థకు అందజేశారు. ఆ సంస్థకు అమెరికా పేటెంట్ హక్కును కల్పించింది. ఈ పరిశో ధనలో క్రాంతి నాగోతు కీలక భూమిక పోషించాడు. సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన క్రాంతి నాగోతు బాలస్వామి, విజయరాణి దంపతుల పెద్ద కుమారుడు. ఇండియన్ ఇనిస్టూట్ ఆఫ్ సైన్సెస్‌లో ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ సైన్స్ పరిశోధన చేసి గౌరవ డాక్టరేట్ పొందాడు. తాను రూపొం దించిన ఈ డివైస్‌కు పేటెంట్ హక్కు రావటం ఒక మంచి పరిణామమని క్రాంతి నాగోతు తెలిపారు.

ఆస్పైర్ బయోనెస్ట్‌తో ఎస్‌ఆర్‌ఎం ఎంవోయూ


ఎంవోయూ పత్రాలను చూపుతున్న ఆస్పైర్, ఎస్ఆర్ఎం ప్రతినిధులు


మంగళగిరిసిటీ, జూలై 4: భారత్‌లో బెస్ట్ ఇంక్యుబేషన్ కేంద్రంగా గుర్తింపుపొందిన ఆస్పైర్ బయోనెస్ట్ (హైదరాబాద్)తో మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. దేశీయ విపణిలో అందుబాటులో వుండే వివిధ రకాల ఉత్పత్తుల రూపకల్పనకు అవసరమైన పరిశోధన, అభివృద్ధి, ఇతరత్రా ప్రయోజనకర వర్క్‌షాపు నిర్వహణ కోసం రెండు సంస్థలు ఎంవోయూ కుదుర్చుకున్నాయి. ఇటీవల హైదరాబాద్ వెళ్లిన ఎస్ఆర్ఎం రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, బయోలాజికల్ సైన్సు ప్రొఫెసర్లు ఆచార్య జయశీలన్, డాక్టర్ చెరుకూరి పిచ్చియ్య లు బయోనెస్ట్ డైరెక్టర్ రాజగోపాల్‌ను కలిసి ఎంవోయూకు అవసరమైన నిర్ణయాలను తీసుకున్నారు. అనంతరం ఎంవోయూ పత్రాలపై డాక్టర్ ప్రేమ్‌కుమార్, ఆచార్య రాజగోపాల్ సంతకాలు చేశారు. ఈఒప్పందం వలన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు, రీసెర్చి ప్రాజెక్టులపై టెక్నాలజీ వినిమయం, క్షేత్రస్థాయి సందర్శనలు సాధ్యమవుతాయని వర్సిటీ పేర్కొంది. కార్యక్రమంలో బయోనెస్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అనిల్ కొండ్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భార్యపై అనుమానంతో హత్య

- గొడ్డలితో తలపై మోది చంపిన వైనం
- మద్యం మత్తులో ఘాతుకం

యడ్లపాడు, జూలై 4: ముప్పై ఏళ్ళ క్రితం పెళ్ళిచేసుకున్న భార్యపై అనుమానం పెంచుకున్నాడు భర్త. అదే విషయంలో ఆమెతో గొడవ పడ్డాడు. క్షణికావేశంలో ఇంట్లో ఉన్న గొడ్డలితో తలపై మోది హత్యచేశాడు. మద్యం మత్తులో ఘాతుకానికి పాల్పడిన నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురం ఎస్సీ కాలనీలో జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన టైలర్ రావూరి నాగేశ్వరరావు 40 ఏళ్ళ క్రిందట వేదకుమారి(55)ని వివాహం చేసుకున్నాడు. గత కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న నాగేశ్వరరావు తరచూ మద్యం తాగి వచ్చి వేధిస్తున్నాడు. చుట్టు ప్రక్కల వారు జోక్యం చేసుకుని సర్ది చెబుతూ వస్తున్నారు. అయితే అనుమాన భూతం వీడని నాగేశ్వరరావు గురువారం ఉదయం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్య వేదకుమారికి వెనుకగా వచ్చి గొడ్డలితో తలపై మోదాడు. దీనితో ఆమె కుప్పకూలగా కుటుంబ సభ్యులు, చుట్టుప్రక్కల వారు గమనించి చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. హత్యకు పాల్పడిన నాగేశ్వరరావు తనంతట తానుగా పోలీసులకు లొంగిపోయాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, యడ్లపాడు ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకుని విచారించి, కలహాలు, అనుమానంతోనే తన భార్యను నాగేశ్వరరావు హత్య చేసి ఉంటాడని పోలీసులు వెల్లడించారు.

మిట్టమీదపల్లెలో వ్యక్తి దారుణ హత్య


వివరాలను సేకరిస్తున్న పోలీసులు, వెంకటరెడ్డి (ఫైల్‌ఫోటో)

వెల్దుర్తి, జూలై 4: పల్నాడుజిల్లా, వెల్దుర్తి మండలంలోని మిట్టమీదపల్లెలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామానికి చెందిన పులి వెంకటరెడ్డి(47) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం మద్యం తాగేందుకు గ్రామ సమీపంలోని ఓ పొలాల్లోకి వెళ్లాడు. ఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తే అతనితో పాటు మరి కొందరు ఉండి మద్యం తాగినట్లు తెలుస్తోంది. అయితే వెంకటరెడ్డి వివాదాలకు, రాజకీయాలకు దూరంగా ఉంటాడని గ్రామస్థులు చెబుతున్నారు. మద్యం తాగిన సమయంలో ఘర్షణ జరిగి హత్యకు గురైనట్లు తెలుస్తోంది. మెడ భాగంలో పదునైన ఆయుధంతో దాడి చేయడంతో వెంకటరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని వివరాలను సేకరిస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పేదల సంక్షేమానికి వంగవీటి సేవలు చిరస్మరణీయం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూలై 4 : పేద ప్రజల సంక్షేమం కోసం వంగవీటి మోహనరంగ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని భీమావారిపాలెంలో కాపుసేవాసంఘం ఆధ్వర్యంలో వంగవీటి జయంతి నిర్వహించారు. సంఘనాయకులు, పార్టీశ్రేణులతో కలిసి ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రంగా ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమానికి బాపట్ల కాపుసేవాసంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, మాజీ చైర్‌పర్సన్ జిట్టా ప్రమీలారాణి, టీడీపీ పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, కాపు సేవా సంఘం ఉపాధ్యక్షులు ఇనపగోళ్ళ రంగారావు, ప్రధాన కార్యదర్శి కె.సురేష్, రౌతు రామాంజనేయులు, లక్కావుల వెంకట్రావు, జనసేన నాయకుడు కారుమూరి ఆంజనేష్, గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్ర, అంకిరెడ్డి రవికుమార్, జి.గిరిజారాణి, కత్తి నాగలక్ష్మి, విష్ణుమొలకల చంద్రమోహన్, జిట్టా శ్రీనివాసరావు, మందపాటి ఆంద్రేయ తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, జూలై 4 : వంగవీటి మోహన్‌రంగా పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేశారని రేపల్లె నియోజకవర్గ టీడీపీ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి అన్నారు. చెరుకుపల్లి మండలంలోని కొత్తపేట, ఊచావారిపాలెం గ్రామాలలోని రంగా విగ్రహాలకు గురువారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యేనుగుల కోటేశ్వరరావు, రవికిరణ్, డేగల సుబ్బారావు, నాగుల పున్నారావు, నాగుల నరేంద్ర, యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఊచా వెంకటేష్, గొల్లపూడి నాగబాబు, ఊచా సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విగ్రహాల వద్ద మిఠాయిలు పంపిణీ చేశారు.

● రేపల్లె, జూలై 4 : ఎన్నికల్లో కూటమి విజయంలో కీలక పాత్ర పోషించిన వంగవీటి రాధాకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని కూటమి నేత మత్తి భాస్కరరావు అన్నారు. తోట వెంకట రామారావు ఆధ్వర్యంలో గురువారం రాధా, రంగ మిత్రమండలి కూటమి నాయకులతో రంగా జయంతి సందర్భంగా నిజాంపట్నం మండలం కూచినపూడిలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి మిఠాయిలను పంచారు. ఈ కార్యక్రమంలో నల్లపాటి రాజశేఖర్, బొప్పా లక్ష్మయ్య, కొలసాని ప్రభాకర్, కేసన సోమయ్య, కె.కోటేశ్వరరావు, అన్నపురెడ్డి పున్నారావు, తోట శ్యామ్, ఎ.నాగార్జున, కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

● చుండూరు జూలై 4 : రాష్ట్రంలో పేదల పక్షపాతిగా, బడుగు బలహీన వర్గాల పెన్నిధిగా వంగవీటి మోహనరంగాకి ప్రత్యేక గుర్తింపు ఉందని జనసేన పార్టీ మండల అధ్యక్షులు శ్రీరామమూర్తి తెలిపారు. మున్నంగివారిపాలెంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన పార్టీ జిల్లా నాయకుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు. గ్రామంలో అన్నదానం నిర్వహించారు. మండూరులో జరిగిన కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం కార్యకర్తలు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ అధికార ప్రతినిధి దేవిరెడ్డి నాగేశ్వరరావు, యాసం జగదీష్, సుగ్గుల వెంకటేశ్వరరావు, అనీల్, యశ్వంత్, ఇక్కుర్తి సీతయ్య, రామకృష్ణ, కొసనా చెన్నా, నాగరాజు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసి మంచి పేరు సంపాదించుకున్న జేసీ

● కలెక్టర్ వెంకటమురళీ



కలెక్టర్‌గా పదోన్నతిపై వెళుతున్న శ్రీధర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళీ

బాపట్ల, జూలై 4 : జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ నిబద్ధతతో పనిచేసి జిల్లాలో మంచి పేరు సంపాదించుకున్నారని కలెక్టర్ జె.వెంకటమురళీ అన్నారు. బాపట్లలో జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తూ కలెక్టర్‌గా పదోన్నతి పొంది అన్న మయ్య జిల్లాకు వెళుతున్న శ్రీధర్‌కు గురువారం కలెక్టరేట్‌లో వీడ్కోలుసభ నిర్వహించారు. జిల్లా అధికారులు, ఉద్యోగులతో కలిసి పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అంద జేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగంలో కష్టనష్టాలను ఒకేలా స్వీకరిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పదోన్నతిపై వెళుతున్న శ్రీధర్ మాట్లాడుతూ బాపట్ల ప్రజలు, అధికారులు, ఉద్యోగుల సహకారం ఎన్నటికి మరువలేనన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలలో జిల్లా ఒకటి నుంచి మూడు స్థానాలలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవోలు గంధం రవీందర్, జి.సూర్యనారాయణరెడ్డి, హేళా షారోను, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ప్రజల మన్ననలను పొందిన శ్రీధర్ పదోన్నతిపై కలెక్టర్‌గా అన్నమయ్య జిల్లాకు వెళుతున్న సందర్భంగా గురువారం సమాజ్‌వాదిపార్టీ జిల్లా అధ్యక్షుడు మేధా శ్రీనివాసరావు పార్టీశ్రేణులతో కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మోర్ల చిన వెంకటేశ్వరరావు, కాండ్రు శరత్‌కుమార్, కొమ్మనబోయన ఫణేంద్రకుమార్ ఉన్నారు.

పేదరిక నిర్మూలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



ఎమ్మెల్యే నరేంద్రవర్మను సన్మానిస్తున్న తిరుమలశెట్టి శ్రీను

బాపట్ల, జూలై 4 : పేదరిక నిర్మూలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను ఆధ్వర్యంలో గురువారం బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నరేంద్రవర్మను ఘనంగా సన్మానించారు. పార్లమెంట్‌లోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో తెలుగుదేశం అభ్యర్థులు ఘన విజయం సాధించటంపై హర్షం వ్యక్తం చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నరేంద్రవర్మ కేక్ కట్ చేసి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చినమాట ప్రకారం పెన్షన్లు పెంచి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి మెగా డీఎస్సీ నోటిఫికేషన్, అన్నాక్యాంటీన్‌ల పునరుద్ధరణ, నైపుణ్యగణన వంటి అంశాలపై తొలి సంతకం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు కొమరిగిరి నాగేశ్వరరావు, అద్దూరి వెంకటేశ్వర్లు, ఇండ్ల శ్రీనివాసరావు, నంబూరి ఏడుకొండలు, బాపట్ల బ్రహ్మయ్య, పి.వెంకటేశ్వర్లు, రాచూరి కుమార్, కందుకూరి రామకృష్ణ, సుబ్బారావు, కొమరిగిరి శ్రీను, నక్కా వెంకటేశ్వరరావు, ఉప్పు సుబ్రహ్మణ్యం, ప్రవీణ్ పాల్గొన్నారు.

స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగిలించిన అల్లూరి

● కలెక్టర్ వెంకట మురళీ

బాపట్ల, జూలై 4 : ఆంధ్రరాష్ట్ర ప్రజలలో స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగిలించిన అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయులని కలెక్టర్ జె.వెంకటమురళీ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, సిబ్బందితో కలిసి అల్లూరి పటానికి కలెక్టర్ పుష్పాంజలి ఘటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్వాతంత్రోద్యమంలో తనప్రాణాలను పణంగా పెట్టి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ప్రజా ఉద్యమాలు నడిపిన గొప్ప నాయకుడు అల్లూరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరపటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో సి.హెచ్.సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, ఎస్సీ సంక్షేమ సాధికార అధికారిణి జె.రాజాదేబోరా, ఏవో లక్ష్మీకుమారి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



అల్లూరి పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటమురళీ, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ తదితరులు



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

● బ్రిటీష్ పాలకులకు ఎదురొడ్డి నిలిచి నమ్మిన సిద్ధాంతంపై భక్తితో అచంచల ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగిన అల్లూరి సీతారామరాజు నుంచి ప్రతి ఒక్కరు స్ఫూర్తిని పొందాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. బాపట్ల క్షత్రియ సేవా సం ఘం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం నిర్వహించారు. సూర్యలంకరోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజును నేటియువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్షత్రియ సేవాసంఘం అధ్యక్షుడు మంతెన ఆనంద గజపతిరాజు, కార్యదర్శి కాకర్లపూడి భాస్కర్‌రాజు, పాలరాజు, గోకరాజు రామకృష్ణరాజు, జయనాగరాజు, జేడీ ప్రసాద్, కరెంట్ శ్రీను, సీనియర్ న్యాయవాది కళ్ళం హరినాథరెడ్డి, చాపల సుబ్రహ్మణ్యం, పఠాన్ రాజేష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, ఎం. శేషకృష్ణ, బీజేపీ నాయకులు మామిడి రమేష్‌కుమార్, బ్రహ్మాండం బాల నారాయణ, ఆర్యవైశ్య నాయకులు వెల్లంపల్లి సత్యనారాయణ, చింతా కిషోర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ కోరారు. అల్లూరి జయంతి కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించారు. పోలీసు అధికారులతో కలిసి ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు, యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, సీఐ శ్రీనివాసరెడ్డి, డీపీవో, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● ఆదివాసిల సాంప్రదాయ వ్యవసాయాన్ని నిరోధించిన బ్రిటీష్ పాలనకు ఎదురొడ్డి నిలిచి, గిరిజనుల జీవనవిధానానికి అవరోధం కలగకుండా సమరశంఖం పూరించిన అల్లూరి సీతారామరాజు ఆదర్శణీయులని బాపట్ల వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్ఆర్ కోటేశ్వరరావు అన్నారు. కళాశాలలో గురువారం అల్లూరి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా డాక్టర్ ఎన్టీఆర్ ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎల్.ఏడుకొండలు ఆధ్వర్యంలో, డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్‌డీన్ డాక్టర్ డీడీ స్మిత్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పట్టణంలోని బాలికాసదన్‌లో సూపరింటెండెంట్ సుబ్బలక్ష్మీ ఆధ్వర్యంలో మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. పీడీ కె.ఉమా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం అధికారి పురుషోత్తంరావు పాల్గొని సీతారామరాజు పటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు.

● పిట్టలవానిపాలెం, జూలై 4 : బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పిట్టలవానిపాలెం బలెంగ్ సెంటర్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ అల్లూరు శివరామరాజు, అల్లూరు మహేంద్ర వర్మరాజు, అల్లూరి అభిమానులు, గ్రామపెద్దలు పాల్గొని అల్లూరు సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొలగాని వెంకట సులోచన నారాయణ, చేబ్రోలు మోహనరావు, రుద్రరాజు రవిశర్మ, గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు, హైస్కూల్ తెలుగు మాష్టర్ పి.శ్రీనివాస్‌నాయక్, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు, అల్లూరు మహేంద్రరాజు, రుద్రరాజు సీతారామరాజు, రుద్రరాజు రవివర్మ, బేతాళం సుబ్బరాజులు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా స్వామివివేకానంద, పింగళి వెంకయ్య వర్థంతిలను శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు మోహన్, సుబ్బరాజు, హైస్కూల్ తెలుగు మాష్టర్ పి.శ్రీనివాస్‌నాయక్, అక్కల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి అతిథులు బహుమతులు అందజేశారు.

● భట్టిప్రోలు, జూలై 4 : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద విగ్రహ సాధన కమిటీ, సమరసత సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బౌద్ధస్తూపం ఎదురుగా గల మినీ ట్యాంక్ బండ్ వద్ద గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివేకానందుడు ధ్యాననిష్ఠతో శివైక్యం చెందిన రోజు ఈ రోజును వారి బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమని ప్రతి ఒక్కరూ వివేకానందుని బోధనలను అనుసరించాలని వక్తలు కోరారు. విగ్రహ సాధన కమిటీ సభ్యులు బం డారు శ్రీనివాసరావు, రావూరి సత్యనారాయణమూర్తి, చెన్నా ఉమామహేశ్వరరావు, రామనాథం రామకృష్ణ, పీహెచ్‌సీ వైద్యురాలు, సిబ్బంది పాల్గొన్నారు.

● వేమూరు, జులై 4 : ధైర్య సాహసాలకు ప్రతీక అయిన అల్లూరి సీతారామరాజు అందరికీ ఆదర్శనీయుడని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, పంచాయితీల కార్యదర్శి వ్యవసాయ శాఖ సిబ్బంది, సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● రేపల్లె, జూలై 4 : నేటి తరం ప్రజలు అల్లూరి సీతారామరాజు ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని పోరాట స్ఫూర్తితో ముందుకు వెళ్ళాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ టీకేవీ గుప్తా, మున్సిపల్ చైర్మన్ బీఆర్ఎస్ శేషాద్రి, ఎం.శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, జూలై 4 : మండలంలోని పలుగ్రామాలలో అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహనరంగా జయంతిని అభిమాన సంఘాలు, కూటమి సభ్యులు ఘనంగా జరిపారు. కర్లపాలెంలోని పాల కేంద్రం వద్ద ఉన్న అల్లూరు సీతారామరాజు విగ్రహానికి పలువురు ఘన నివాళులర్పించారు. మండలంలోని చింతాయపాలెం, పేరలి, యాజలి, దమ్మనవారిపాలెం, గణపవరం, నల్లమోతువారిపాలెం గ్రామాలలో వంగవీటి మోహనరంగా జయంతిని ఘనంగా జరిపి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెనుమెత్స శివాజిరాజు, పెనుమెత్స హరినాధరాజు, వెంకటరామరాజు, మంతెన హరినాధరాజు, మంతెన నరేంద్రవర్మరాజు, శ్రీకృష్ణ, సురేంద్రబాబు, ఎం.బాలాజి, కె.బాలాజి, కె.వాసు, మాడా శ్రీనివాసరావు, కుంటా కృష్ణమూర్తి పాల్గొన్నారు. కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి తహసీల్దార్ నిర్మలానందబాబా పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కర్రి శ్రీనివాసరావు, సిబ్బంది చందు, కుంచాల గోపిరెడ్డి ఉన్నారు.

● బాపట్ల రూరల్, జూలై 4 : నేడు భారత్ ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వంతో జీవిస్తున్నారంటే అందుకు కారణం అల్లూరి సీతారామరాజు అని బాపట్ల ఎంపీడీవో పి.విజయశేఖర్ అన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా బాపట్ల ఎంపీడీవో కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కార్యాలయ సిబ్బందితో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం ఎంపీడీవో కె.నేతాజి, ఈవోపీఆర్డీ, ఇన్‌చార్జి డీఎల్‌పీవో శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి కృషి చేయాలి

బాపట్ల, జూలై 4 : దేశంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు శీఘ్రంగా అభివృద్ధి చెందటం కోసం పాలకులు కృషి చేయాలని నల్లమడ రైతు సంఘం నాయకుడు విజయకుమార్ డిమాండ్ చేశారు. బాపట్ల అంబేద్కర్ భవన్‌లో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని అఖిల భారత రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. నిరుపేదల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ కేశవులు, ఎంపీ రంజాన్, ఎస్కే అజిత, మిక్కిలి ఏసుమణి, దేవరకొండ సుబ్బలమ్మ, నాగమణి, నాగూర్‌బి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పింగళిదీప్తి.. ఖండాంతర కీర్తి : డాక్టర్ సాయిబాబు

బాపట్ల,జూలై 4 : జాతీయ పతాకానికి రూపకల్పన చేసి తెలుగు వారి ఖ్యాతిని దేశవ్యాప్తంగా ఇనుమడింప చేసిన పింగళి వెంకయ్య చిరస్మరణీయులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. పింగళి వెంకయ్య వర్థంతిని ఫోరం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని పింగళి విగ్రహానికి విద్యార్థులతో కలిసి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏవీవీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి : ఏవో

పిట్టలవానిపాలెం, జూలై 4 : స్థానిక రైతు సేవా కేంద్రాలలో రైతులకు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖాధికారి సీహెచ్ సత్యానంద్ గురువారం తెలిపారు. వ్యవసాయ తరుణంలో వరినార్లు వేసుకునేందుకు రూ.5 సబ్సిడీపై కేజికి బీపీటీ 5224, ఎంటియు 1224, 1061 వరివిత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వివిధరకాల వర్తివిత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో తెలిపారు. 2024-2025 సంవత్సరానికిగాను పంటసాగుదారులు కౌలుదారు హక్కుపత్రాలను స్థానిక రెవెన్యూశాఖవారు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు లక్కంరాజు వెంకటపతిరాజు, సర్పంచ్ బొలగాని అరుణకుమారి సుబ్బారావు, పిట్టలవానిపాలెం మాజీ సర్పంచ్ కనుమూరి సాంబమూర్తిరాజు, మాజీ ఎంపీపీ బొలగాని వెంకట సులోచన నారాయణ, వ్యవసాయ విస్తరణాధికారి సుదర్శనరావు, వ్యవసాయ సహాయకులు, రైతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అంగన్‌వాడీలకు అవగాహన

బాపట్ల, జూలై 4 : బాపట్ల ఐసిడిఎస్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీలకు నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో ఎన్.పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బాలల పరిరక్షణాధికారి పి.పురుషోత్తమరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 100రోజుల కార్యక్రమంలో భాగంగా నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ప్రతిసెక్టార్‌లో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు జ్యోతి, త్రివేణి, ఎల్‌సిపిఓ మౌనిక, స్వప్నప్రియ, కృష్ణ, రోజలిన్ తదితరులు పాల్గొని అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు.

పదోన్నతి పొందిన పోలీసులకు ఎస్పీ అభినందనలు

బాపట్ల,జూలై 4 : జిల్లాలో నూతనంగా పదోన్నతులు పొందిన పోలీసుసిబ్బందిని గురువారం ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. అంకితభావంతో పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచేవిధంగా విధులు నిర్వహించాలని సూచించారు. కానిస్టేబుళ్ళుగా విధులు నిర్వహిస్తూ హెడ్ కానిస్టేబుళ్ళుగా పదోన్నతి పొందిన ఎం.శ్రీనివాసరావు, బి.సీతారామిరెడ్డి, డి.చిరంజీవి, యు.ప్రసాదరావు, ఎం.రవినాగేంద్రబాబులను అభినందించి పదోన్నతి వల్ల బాధ్యత పెరుగుతుందని చెప్పారు.

శ్మశానవాటికలో పిచ్చిమొక్కలు తొలిగింపు

పిట్టలవానిపాలెం, జూలై 4 : మండలంలోని చందోలు గ్రామ పంచాయతీలోని ముస్లిం శ్మశాన వాటికలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, తదితర వ్యర్థాలను గురువారం తొలగించారు. పిట్టలవానిపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ తన సొంత ఖర్చులతో శ్మశాన వాటికలో పిచ్చిమొక్కలను, వ్యర్థాలను తొలిగించి కలుపు మొక్కలను నివారించేందుకు మందును పిచికారి చేయించారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఏఎన్ఎం

పిట్టలవానిపాలెం, జూలై 4 : సీజనల్ వ్యాధులపై గ్రామప్రజలు అప్రమత్తంగా ఉండాలని అల్లూరు ఏఎన్ఎం అరుణకుమారి అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామపంచాయతీలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మలేరియా, ఫైలేరియా, మెదడు వాపు, డెంగీ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా, అతిసార వంటివి ప్రబలకుండా తగుజాగ్రత్తలను తీసుకోవాలని ఆమె గ్రామ ప్రజలకు తెలియజేశారు. వర్షపు నీరు నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు.

శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ముఖమండపానికి మైక్‌సిస్టమ్ బహుకరణ

బాపట్ల రూరల్, జూలై 4 : బాపట్ల మండలం భర్తీపూడి గ్రామంలో ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి ముఖమండపం ఆర్చికి రూ.40 వేల విలువ చేసే మైక్‌సిస్టమ్‌ను సర్పంచ్ అచంట అమరేష్ దేవాలయ కమిటీకి గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అచంట సాంబశివరావు జ్ఞాపకార్థం భార్య అచంట వెంకటసుబ్బమ్మ, కుమారుడు అచంట రామకృష్ణ, గ్రామసర్పంచ్ అచంట అమరేష్ దేవాలయ కమిటీకి అందజేయటం జరిగిందని తెలిపారు.

బాపట్ల ఫొటోగ్రాఫర్‌కు జాతీయ స్థాయిలో బంగారుపతకం



పి.వి.ఎస్.నాగరాజు

బాపట్ల, జూలై 4 : బాపట్ల మండలం ముత్తాయిపాలెం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ పీవీఎస్ నాగరాజుకు జాతీయ స్థాయిలో బంగారు పతకం లభించింది. ఇటీవల ఉత్తర ప్రదేశ్‌లో మణికర్ణిక ఆర్ట్ గ్యాలరీ వారు నిర్వహించిన జాతీయస్థాయి ఆర్ట్ అండ్ ఫొటోగ్రఫీ కాంపిటేషన్‌లో నాగరాజు పంపించిన ఛాయాచిత్రానికి బంగారుపతకం లభించింది. నాగరాజుకు మణికర్ణిక ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కామిని బాగెల్ అవార్డు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజును పలువురు అభినందించారు.



వేమూరులో రోశయ్యకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఆర్యవైశ్యులు గర్వించ దగ్గ వ్యక్తి రోశయ్య

● సంఘం అధ్యక్షుడు గాంధీ

వేమూరు, జూలై 4 : రాజకీయ రంగంలో రాటు తేలిన నాయకుడిగా గుర్తింపు పొందిన కొణిజేటి రోశయ్య ఆర్యవైశ్య కులంలో జన్మించడం గర్వించ దగ్గ విషయమని ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు నంబూరు గాంధీ అన్నారు. దివంగత తమిళనాడు మాజీ గవర్నర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వేమూరు గ్రామ వాసి కొణిజేటి రోశయ్య 91వ జయంతిని గురువారం ఆయన స్వగ్రామమైన వేమూరులో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాంధీ మాట్లాడుతూ ఆయన ద్వారా వేమూరుకు గుర్తింపు లభించిందని అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బాదం సుబ్బయ్య, తాళ్ళూరి శ్రీనివాసరావు, చేబ్రోలు శివప్రసాద్, దుంప గణేష్, సాధు శ్రీనివాసరావు, నేరెళ్ళ సుబ్బారావు, నంబూరు మల్లికార్జునరావు, పిచ్చిరాజు, కొల్లివర శ్రీరామమూర్తి, వేణు, తదితరులు పాల్గొని రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిఠాయిలు పంపిణీ చేశారు.

● భట్టిప్రోలు, జూలై 4 : రాజకీయ జీవితంలో అజాత శత్రువుగా అందరి మన్ననలు పొందిన మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య చిరస్మరణీయులని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం దివంగత కొణిజేటి రోశయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఎంఎల్‌సీగా రాజకీయ రంగప్రవేశం చేసి ఎమ్మెల్యేగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా తాను నిర్వహించిన అన్ని పదవులకు వన్నె తెచ్చిన ఏకైక నాయకుడు రోశయ్య అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి సునీల్‌కుమార్, వంగర చలమయ్య సిద్ధాంతి, తూనుగుంట్ల ఈశ్వరబాబు, బొలిశెట్టి శ్రీనివాసరావు, కూరాళ్ళ రవి, శనగపల్లి శ్రీనివాసరావు, ఉమాశంకర్, మద్దుల కిరణ్, వెంకటేశ్వరరావు, ఇబ్రహీంబేగ్, వాలేశ్వరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యాంత్రీకరణ పథకాలను అందించేది కూటమి ప్రభుత్వమే



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న అనగాని శివప్రసాద్ తదితరులు

చెరుకుపల్లి, జూలై 4 : రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రెవెన్యూ శాఖామంత్రి అనగాని సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. కావూరు గ్రామంలో గురువారం ప్రభుత్వ సబ్సిడీ విత్తనాల పంపిణీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసమావేశానికి గ్రామ సర్పంచ్ జ్యోతి అధ్యక్షత వహించారు. అనంత రం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులకు చేసింది ఏమీ లేదని, రైతుల కోసం పని చేసేది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మల్లాది రామకృష్ణ, టీడీపీ నాయకులు పూషడపు కుమారస్వామి, తాతా ఏడుకొండలు, మండవ తాతాజీ, సుఖవాసి వాసు, మండవ బుల్లిబాబు, ఏడీఏ హుస్సేన్, వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజీలో కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి

నగరం, జూలై 4 : నీట్ పేపర్ లీకేజీకి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని విద్యా రంగాన్ని కాపాడాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షుడు వైనవీన్ అన్నారు. గురువారం మండలంలోని ఉల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఎస్వీఆర్ఎం కాలేజీ, ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలను ఎస్ఎఫ్ఐ నాయకులు మూసివేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సూర్య, హేమ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ టీడీపీ కార్యకర్తకు ట్రై సైకిల్ అందజేత

కొల్లూరు, జూలై 4 : టీడీపీ కార్యకర్త, దివ్యాంగుడు అయిన మోర్ల శ్రీనివాసరావుకు టీడీపీ నాయకుడు మైనేని మురళీకృష్ణ చేతుల మీదుగా ట్రైసైకిల్ అందజేశారు. మండల పరిధిలోని తిప్పలకట్ట గ్రామంలో కుడితిపూడి ఉమామహేశ్వరరావు ప్రథమ వర్థంతి పురస్కరించుకుని గురువారం ఆయన కుమారుడు గంగాధర్ దివ్యాంగ టీడీపీ కార్యకర్తకు ట్రైసైకిల్‌ను కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ, జువ్వలపాలెం గ్రామ పార్టీ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో కుడితిపూడి బసవయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపల్లె తాలూకా ఏపీ హంస అధ్యక్షుడిగా చక్రధరరావు

రేపల్లె, జూలై 4 : ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్ (హంస) ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రేపల్లె తాలూకా ఏపీ హంస అధ్యక్షుడిగా గల్లా చక్రధరరావు ఎన్నికైనట్లు గుంటూరు జిల్లా అధ్యక్షుడు డి.నాగవర్ధన్ తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో గురువారం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. కార్యదర్శిగా వేజండ్ల సుభాష్‌బాబు, కోశాధికారిగా వైవీ కృష్ణయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.సారంగపాణి, పబ్లిసిటి సెక్రటరీగా పులి వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు వైద్యసిబ్బంది అభినందించారు.

భూసార పరీక్షలతో దిగుబడిని పెంచుకోవచ్చు

రేపల్లె, జూలై 4 : పంట దిగుబడికి సంబంధించిన ఎరువుల వాడకాలకు ప్రతి సంవత్సరం మట్టి నమూనాలను సేకరణ చేస్తే వరి సేద్యం తక్కువ ఖర్చుతో చేసుకునేందుకు దోహదపడుతుందని అత్త డీపీవో డి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని వడ్డివారిపాలెం జడ్పీహెచ్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భూసార పరిరక్షణ మట్టి నమూనాల సేకరణ మొదలైన అంశాలపై శిక్షణను ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నేల సంరక్షణ, భూసారాన్ని పెంపొందించటం, మట్టి నమూనాల సేకరణపై సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఆర్.విజయబాబు, ఏవో రాజవంశీ, ఎం.ప్రభాకరరావు, సుమ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ అధికార ప్రతినిధిగా దాసరి రంగా

వేమూరు, జూలై 4 : వేమూరు నియోజకవర్గ జనసేన పార్టీ అధికార ప్రతినిధిగా వేమూరు మండలం పెరవలిపాలెం గ్రామానికి చెందిన దాసరి రంగా నియమితులైనట్లు ఉత్తర్వులు అందినట్లు గురువారం రంగా తెలిపారు. ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తనకు నియామక పత్రాన్ని అందించినట్లు పేర్కొన్నారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్‌కు రంగా కృతజ్ఞతలు తెలిపారు. చావలి, పెరవలి, పెరవలిపాలెం తదితర గ్రామాల జనసైనికులు దాసరి రంగాను అభినందించారు.



కలెక్టర్ మురళికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

కలెక్టర్‌ని కలిసిన ఎంపీడీవో

చినగంజాం, జూలై 4 : కలెక్టర్ జేవీ మురళిని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి గురువారం మర్యాద పూర్వకముగా కలిశారు. కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మురళికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా నియమితులైన చామకూరి శ్రీధర్‌ని ఎంపీడీవో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

విద్యార్థుల హాజరును పెంచాలి

మార్టూరు, జూలై 4 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో సీహెచ్.వస్రాంనాయక్ అన్నారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. అవసరమైతే ఇంటింటికీ వెళ్లి సాయంత్రం వేళ అదనపు పని వేళలను కేటాయించి విద్యార్థుల్లో జ్ఞానం పెంచేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా స్కూళ్లలో చేతులు శుభ్రపరచడం, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, వేడిగా ఉండే భోజనాన్ని, మంచినీటిని అందించాలని ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు రమేష్, రామారావు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతల ఉన్నతే లక్ష్యం

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి
- ఎరువులు, విత్తనాలన్నీ అందుబాటులో ఉండాలి
- మిచౌంగ్ పరిహారం వెంటనే అందించాలి
- పర్చూరు మిర్చి యార్డును అందుబాటులోకి తెస్తా
- హైబ్రిడ్ కూరగాయల సాగుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- వ్యవసాయ అనుబంధ శాఖల సమీక్షలో ఎమ్మెల్యే ఏలూరి



వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జూలై 4: అన్నదాతల ఉన్నతే లక్ష్యంగా పాలన సాగిస్తామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వ్యవసాయ అనుబంధ శాఖలైన అగ్రికల్చర్, అర్టికల్చర్, మార్కెటింగ్ శాఖలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అన్నదాత అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అధికార యంత్రాంగం రైతుల పట్ల అప్రమత్తంగా ఉండి వారి అభ్యున్నతికి సహకరించాలన్నారు. విధి నిర్వహణలో అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. వైసీపీ వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, రైతులు అవసరాలు ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. అన్నదాతల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆ యా శాఖల్లో ఉన్న ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

వ్యవసాయశాఖ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ రైతులకు చేదోడుగా నిలవాలని ఎమ్మెల్యే ఏలూరి ఆదేశించారు. ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు నేపథ్యంలో రైతులకు అవసరమైన పిల్లిపెసర, జీలుగ వంటి విత్తనాలను అందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలను రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో మైక్రో న్యూట్రిషన్ అందించి రైతు సంఘానికి అండగా నిలిచారన్నారు. రైతన్నలకు అవసరమైన యంత్ర పరికరాలు అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలన్నారు. ఎస్ఎఫ్ఎస్ఎన్ పథకం కింద యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించ లేదని వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆధునిక సాగువైపు కదిలించాలి

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఆధునిక సాగు వైపు రైతులు అడుగులు వేసేలా చైతన్యం చేయాలన్నారు. పండ్లు, హైబ్రిడ్ వెజిటేబుల్ సాగుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసి రైతులను ఆదిశగా మళ్లించాలని సూచించారు. రైతులకు అవసరమైన స్ప్రేయర్‌లు, రోటవేటర్లు అందించేందుకు కృషి చేయాలన్నారు. బెస్ట్ రైతు సంఘాలు, ఏపీలోఐదు బెస్ట్ ప్రదేశాలను గుర్తించి అక్కడకు రైతులను సందర్శనకు తీసుకు వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

మార్కెట్ యార్డ్ విస్తరణకు చర్యలు

నియోజకవర్గంలో మార్కెట్ యార్డ్‌లలో విస్తరణకు ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. రైతుల సౌలభ్యం కోసం మార్కెట్ యార్డులను విస్తరించాలని ప్రతిపానలు చేయాలని ఆధికారులను ఆదేశించటం జరిగిందన్నారు. పర్చూరు మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలన్నారు. పంట ఉత్పత్తులను నిల్వచేసేలా గోడౌన్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలన్నారు. పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చిన్నగంజాంలో గోడౌన్‌లను నిర్మాణం చేపడతామన్నారు. ఇంకొల్లు, పర్చూరులో పదివేల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి ప్రతిపాదన చేయాలని అధికారులను ఆదేశించారు.



మంత్రి రవికుమార్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

మంత్రులకు ఆర్యవైశ్య నేతల శుభాకాంక్షలు

అద్దంకి, జూలై 4 : మంత్రులు గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్‌ను అద్దంకి పట్టణ ఆర్యవైశ్య నాయకులు గురువారం సచివాలయం వద్ద చాంబర్లలో కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో అద్దంకి పట్టణ ఆర్యవైశ్య నాయకుడు టీడీపీ అద్దంకి పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిన్ని శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శింగరకొండ ఆర్యవైశ్య అన్నదానసత్రం కార్యనిర్వాహక అధ్యక్షుడు భోజనపల్లి సత్యనారాయణ, చుండూరి మురళీసుధాకరరావు, నాగసూరి రమేష్‌బాబు, సంకా సుబ్రహ్మణ్యం, కురిచేటి వెంకటసుబ్బారావు, ఆత్మకూరి మస్తానయ్య, జవ్వాజి ఏడుకొండలు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, నేరెళ్ల శేషగిరి, ఆర్వపల్లి హనుమంతరావు, మల్లికార్జునరావు, శ్రీరామ్ హరిబాబు, మాజేటి సత్యం, చామర్తి మల్లికార్జునరావు, రవికుమార్ పాల్గొన్నారు.

రోశయ్య చిరస్మరణీయుడు



రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కరణం

చీరాల, జూలై 4 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య చిరస్మరణీయులని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఎంజీసీ మార్కెట్ ప్రాంగణంలోని ఆయన కాంస్య విగ్రహానికి గురువారం పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోశయ్య అజాతశత్రువుగా మన్ననలు పొందిన వ్యక్తన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి రోశయ్య కాంస్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంజీసీ మార్కెట్ ప్రతినిధులు, రోశయ్య అభిమానులు, పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

అద్దంకి : రోశయ్యకు ఆర్యవైశ్య నాయకులు నివాళులర్పించారు. పాత గాంధీబొమ్మ సెంటర్‌లో కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య నాయకులు సోమిశెట్టి సుబ్బరాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కాకరపర్తి రమేష్, కూరపాటి రామకోటేశ్వరరావు, మామిడి రాంబాబు, పొట్టి శివ, చిన్ని ప్రసాద్ పాల్గొన్నారు.

నాగరాజుపల్లిలో పారిశుధ్య పనులు

మార్టూరు, జూలై 4 : మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో మూడు రోజుల నుంచి శానిటేషన్ కార్మికులు పారిశుధ్య పను లు చేస్తున్నారు.డెంగ్యూ నివారణ మాసోత్సవాలు, స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్యపనులు చురుగ్గా చేస్తున్నారు. బల్లికురవ రోడ్ నుంచి గ్రామంలోని జడ్పీ హైస్కూల్, సచివాలయం వరకు మురుగునీరు నిలబడకుండా కాలువలను శుభ్రం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల నిలిచి ఉన్న మురుగును ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్నారు. జడ్పీ హైస్కూల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, సీజనల్ వ్యాధుల బారిన విద్యార్థులు పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి మురళి తెలిపారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పంగులూరు, జూలై 4 : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ద్వారా వ్యాధులు దూరమవుతాయని ఆరోగ్య పర్యవేక్షకుడు మదరసా అన్నారు. మండలంలోని కోటపాడు గ్రామంలో గురువారం డయేరియాపై ఆరోగ్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మదరసా మాట్లాడుతూ వాంతులు, విరేచనాలు రాకుండా సురక్షితమైన మంచినీటిని తాగాలన్నారు. కాచి చల్లార్చిన నీరు, వేడి పదార్థాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బిందు, ఏఎన్ఎం మంగమ్మ పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం

అద్దంకిటౌన్, జూలై 4 : చేతుల పరిశుభ్రతతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేయాలని ఎంఈవో బూదాటి సుధాకరరావు అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. చేతుల పరిశుభ్రత ద్వారా ఏఎన్ఎంలు అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఈ విద్య సంవత్సరంలో పాఠశాలకు సంబంధించి పలు అంశాలపై పలు సూచనలు చేయడం జరిగింది. కార్యక్రమంలో సీఆర్పీలు పుణ్యవతి, రామకృష్ణ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. తప్పిన ప్రమాదం

మార్టూరు, జూలై 4 : జాతీయ రహదారిపై గుంటూరు వైపు మండల పరిధిలో ఇసుకదర్శి సెంటరు సమీపంలో కారు డివైడర్‌ను ఢీకొన్న సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. ఒంగోలు నుంచి విజయవాడలోని కాలేజీలో జాయిన్ చేసేందుకు దోమల రజనీకాంత్ అనే వ్యక్తి కుమార్తెతో కారులో వెళుతున్నారు. రోడ్డు ప్రక్కన మతిస్థిమితం లేని వ్యక్తి కారుపైకి రాళ్లు విసరగా ఈ రాయిని తప్పించుకోవడానికి ప్రయత్నించగా కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొడుతూ డివైడర్‌ను దాటి ఒంగోలు వైపు కారు నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ఒక వైపు టైరు దెబ్బతిన్నది. తండ్రీ కుమార్తెలు క్షేమంగా బయటపడ్డారు. అనంతరం వారి బంధువులకు సమాచారం ఇవ్వగా మరో కారు అక్కడకు రాగా వారు దానిలో వెళ్లిపోయారు. హైవే మొబైల్ వారు రోడ్డుపై ఉన్న కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చేశారు.

టోల్ గేట్ వద్ద స్తంభాన్ని ఢీకొన్న చేపల లారీ



లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

మార్టూరు, జూలై 4 : జాతీయ రహదారిపై ఒంగోలు వైపు మండల పరిధిలో బొల్లాపల్లి టోల్ గేట్‌లో ఇనుప స్తంభాన్ని చేపల లారీ ఢీకొన్న ఘటన గురువారం రాత్రి 9 గంటలకు జరిగింది. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో డ్రైవింగ్ సీటులోనే డ్రైవర్ ఇరుక్కుపోయారు. లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు డ్రైవరు నున్న శివనాగరాజు పోలీసులకు తెలిపారు. అతనికి స్వల్పగాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు.. గుడివాడ నుంచి నెల్లూరుకు చేపల లోడుతో వెళుతున్న లారీ ఒంగోలు వైపు వెళ్లడానికి టోల్ గేట్‌లో 1 వనంబరు గేట్ లోపలకు ప్రవేశించింది. ఈ లారీ ముందు ఎక్స్‌కవేటర్‌ను తీసుకెళ్తున్న లారీ టోల్ గేట్ నుంచి బయటకు వెళుతున్న సమయంలో వెనుక నుంచి చేపల లారీ బ్రేకులు ఫెయిల్ అయి స్వల్పంగా ఎక్స్‌వేటర్ లారీ వెనుక వైపును ఢీకొట్టింది. దాంతో చేపల లారీని అదుపుచేయలేని డ్రైవరు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, లారీ క్యాబిన్‌లో డ్రైవరు ఇరుక్కు పోయారు. ఇలా కాకుండా లారీ టోల్ గేట్ నుంచి బయటకు వచ్చినట్లయితే అదే సమయంలో ఒంగోలు వైపు, బెంగళూరు వైపు వెళ్లడానికి ట్రావెల్స్ బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులను లారీ ఢీకొనే ప్రమాదం ఉండేది. అయితే లారీ పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. దాంతో టోల్ గేట్ వద్ద ఉన్న సిబ్బంది, హైవే మొబైల్ వారు వెంటనే స్పందించి ఎక్స్‌కవేటర్ సాయంతో లారీని అక్కడ నుంచి తొలగించి డ్రైవింగ్ సీటులో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. అతనికి స్వల్పగాయాలు కావడంతో వెంటనే అతనిని టోల్ గేట్‌కు చెందిన అంబులెన్సులో అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న నిర్మల

డిప్యూటీ డీఈవో సందర్శన

పంగులూరు, జూలై 4 : మండలంలోని కొండమూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం చీరాల డిప్యూటీ డీఈవో ఎం.నిర్మల సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తరగతిగదిలో ఉపాధ్యాయుడు పాఠ్యాంశ బోధనతో పాటు సంసిద్ధతా కార్యక్రమాలపై దృష్టిసారించాలని సూచించారు. విద్యార్థులకు డిప్యూటీ డీఈవో నిర్మల పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ, బెల్ట్, బ్యాగ్‌తో ఉన్న కిట్‌లను విద్యార్థులకు అందజేశారు. విద్యా కిట్లను సమగ్ర శిక్ష సీఈవో శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఎంఈవో నాగభూషణం, వీరాంజనేయులు హెచ్ఎం ఆదినారాయణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ హరిబాబు, సీఆర్‌పీలు సురేష్, మోషే, శ్యామల పాల్గొన్నారు.

కొణికిలో నేత్రదానం

ఇంకొల్లు, జూలై 4 : మండలంలోని కొణికిలో నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన శ్రీమతి నాగమణి మృతి చెందగా, ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన నాగమణి కుటుంబసభ్యులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి, అధ్యక్ష కార్యదర్శులు డాక్టరు రఫీ, సాంబశివరావు, క్లబ్ సభ్యులు అభినందించారు.

6న సర్వసభ్య సమావేశం

ఇంకొల్లు, జూలై 4 : ఎంపీడీవో కార్యాలయంలో 6వ తేదీ శనివారం ఉదయం 10.30లకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన జరగనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము - ఇంకొల్లు
ఇంకొల్లు మండలం, బాపట్ల జిల్లా

టెండర్ ప్రకటన

బాపట్ల జిల్లా, ఇంకొల్లు మండలం, ఇంకొల్లు గ్రామ పంచాయతీకి 2024-2025 సం॥నకు పారిశుధ్య నిర్వాహణకు సంబంధించి ఈ క్రింది తెలిపిన సిబ్బంది ద్వారా పని చేయించుటకు సప్లయ్ దారుని కొరకు తేది.10-07-2024న మధ్యాహ్నం 1.00గంట వరకు టెండర్లు స్వీకరించబడును. గ్రామ పంచాయతీ కార్యదర్శి గారిచే మరియు వారి అనుమతి పొందిన వారిచే గ్రామ పంచాయతీ కార్యాలయము నందు టెండర్లు స్వీకరించబడి అదే రోజు మధ్యాహ్నం 3:00 గంటలకు హాజరైన టెండర్లు దారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. టెండరు దారులు టెండరు ధారవత్తు చెల్లించి టెండరు షెడ్యూలు జతపరచవలెను. సకాలంలో రాని టెండర్లు ధరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు. మిగతా వివరములు కొరకు ఆఫీసు పని సమయములో తెలుసుకొనవలెను.

వ.నెం.	టెండరు వివరములు	చెల్లించవలసిన ధరావత్తు
1.	తేది.01-07-2024 నుండి తేది.30-06-2025 వరకు టెండరు పద్ధతిపై స్వీపర్లుగా-40 మంది, శానిటరీ మేస్త్రి-2, ట్రాక్టరు డ్రైవర్లు-2, అటెండరు-1 PWS టర్న్ కాకలు-5 మంది, చెరువు కాపలాదారులు-3, బిల్లు కలెక్టర్లు-3, ఎలక్ట్రీషియన్-1, ఆఫీసు నైట్ వాచ్‌మెన్-1 ద్వారా పనిచేయించుటకు సప్లయ్ దారుని కొరకు	ఒక్కొక్కరికి రూ.200/-

నిబంధనలు :
1. పై పోస్టులు శ్రీయుత జిల్లా పంచాయతీ అధికారి, బాపట్ల జిల్లా వారి ఉత్తర్వులకు లోబడి అమలులోనికి వచ్చును. జిల్లా పంచాయతీ అధికారి ఆమోదం ఉత్తర్వులు మేరకు పేమెంట్ చెల్లించబడును.
2. ఏ కారణమూ చేతనైనను టెండర్లు రద్దు పరచుటకు అమలుపరచుటకు పంచాయతీ కార్యదర్శిగారికి పూర్తి అధికారము కలదు.
3. ధరావత్తు వాపసు చేయుటకు ఎలాంటి వడ్డీ చెల్లించబడదు.
4. బిల్లు జాప్యంలో కూడా ఎలాంటి వడ్డీ చెల్లించబడదు.

సం/- జి.కోట నాగయ్య,
పంచాయతీ కార్యదర్శి, ఇంకొల్లు, ఇంకొల్లు(మం), బాపట్ల జిల్లా.

నేటి తరానికి స్ఫూర్తి అల్లూరి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సుభద్ర

అద్దంకి, జూలై 4 : అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలతోపాటు నందమూరి కళాపరిషత్ కార్యాలయంలో గురువారం అల్లూరి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ సుధారాణి, ఆర్ఐ శంకరరావు, ఏఎస్‌వో అమర్‌నాథ్, నందమూరి కళాపరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, అన్నమనేని వెంకట్రావు, పీసీహెచ్ కోటయ్య, ఎర్రమోతు రమేష్, కూరపాటి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

బల్లికురవ : బ్రిటీష్ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించిన అల్లూరి సీతారామరాజు సేవలను అందరూ గుర్తు చేసుకోవాలని తహసీల్దార్ సుభద్ర తెలిపారు. గురువారం కార్యాలయంలో అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఏఎస్‌వో అమరనాథ్, సిబ్బంది ప్రకాష్‌రావు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పంగులూరు : అల్లూరి త్యాగధనుడని పలువురు కొనియాడారు. మండలంలోని చందలూరు గ్రామంలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందుకూరి సుబ్బరాజు, అప్పలరాజు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పెంట్యాల కిష్టారావు, రామాంజనేయులు, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, సతీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీరాల : విప్లవ వీరుడు, మన్యం ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కమిషనర్ చక్రవర్తి తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

మార్టూరు : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం మండలంలోని రాజుగారిపాలెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానసెంటరులో ఉన్న అల్లూరి విగ్రహానికి మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు, గ్రామస్తులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అల్లూరి పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. తీసుకువచ్చి ఆయన గొప్పతనాన్ని వీరోచిత పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. మాజీ ఉపసర్పంచ్ అచ్చిరాజు, కళ్లేపల్లి శ్రీనివాసరాజు, చి ంతలపూడి శ్రీనివాసరావు, కళ్లేపల్లి హనుమంతరాజు, ధనంజయ, కళ్లేపల్లి హరికృష్ణ, జగదీష్ అల్లూరికి నివాళులర్పించారు.

వంగవీటికి ఘనంగా నివాళులు



వంగవీటి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సంఘ నేతలు

చినగంజాం, జూలై 4 : మండలంలోని పలు గ్రామాల్లో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లోని జనసేన కార్యాలయంలో టీడీపీ కూటమి నాయకులు మోహనరంగా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. తదనంతరం కేకు కట్ చేశారు. రంగా జయంతి సందర్భంగా స్థానిక చుండిబజారులోని వాల్మీకి వృద్ధాశ్రయంలోని వృద్ధులకు దుప్పట్లు, రిక్షా కార్మికులకు కండు వాలు పంపిణీ చేశారు. కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కడవకుదురు గ్రామంలో రంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పర్వతరెడ్డి సత్యనారాయణ, తుమ్మల పెంట సీతారామయ్య, టీ.జయరావు, శిఖరం వెంకటేశ్వర్లు, సందు శ్రీనివాసరావు, కట్టెబోయిన సుబ్బారావు, ఎస్.శ్రీనివాసరావు, సందు శ్రీరామ్, శిఖరం కోటయ్య పీ.పార్థసారిధి, గంటా చెన్నయ్య పీ.లక్ష్మీనారాయణ, డీ.ఏసునారాయణ, ఎస్.రాంబాబు, కుర్రి వాసుదేవరావు, చిన్నా, జీవీ లక్ష్మీనారాయణ, ఎన్.గోపి, టి.వెంకటేశ్వర్లు, జి.వెంకటనారాయణ, ఎస్.సూరిబాబు, మహేష్, నారాయణ, రంగా అభిమానులు పాల్గొన్నారు.

పర్చూరు : వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలు గురువారం కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. బొమ్మల సెంటర్‌లో ఏర్పాటు చేసిన వంగవీటి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాపుల ఐక్యత వర్ధిల్లాలి జిందాబాద్ జనసేన, పవన్ కల్యాణ్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్ కుమార్ పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాపు నేతలు, జనసేన నాయకులు కఠారి సురేంద్రబాబు, ఒగ్గిశెట్టి నరసింహం, కారంపూడి సందీప్‌తేజ, తులసి చంటి, మాధవరావు మాస్టర్, తులసి అప్పారావు, రంగిశెట్టి ఆంజనేయులు, తులసి శ్రీనివాసరావు, తంగెళ్ళ మల్లికార్జునరావు, రంగిశెట్టి రవికుమార్, రంగిశెట్టి ఆంజనేయులు, గోగుల శ్రీను, సాంబయ్య పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

అద్దంకిటౌన్, జూలై 4 : కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలపై చేస్తున్న దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని ప్రజా సంఘాల నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలను ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను తరగతుల నుంచి బయటకు పంపించడంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బాలికల ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులతో విద్యార్థి సంఘాలు ర్యాలీ నిర్వహించారు. విద్యా ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా అందరు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు షేక్ బాజీ, విద్యార్థులు వినిత్, శాలెంరాజ్, వెంకీ, సత్య పాల్గొన్నారు.

చీరాలటౌన్ : నీట్ పరీక్షలు నిర్వహిస్తున్న ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన బంద్ విజయవంతం అయింది. కార్యక్రమంలో సంఘ నాయకులు ఠాగూర్, కార్యకర్తలు దినేష్, నవీన్, రాకేష్, పాల్, విష్ణువర్ధన్, కోటేశ్వరరావు, అనిల్, సూర్య పాల్గొన్నారు.



బంద్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

పంగులూరు : నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం బంద్ పాటించారు.

చినగంజాం : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు బంద్ చేయించారు. కార్యక్రమంలో నాయకులు కే.రవితేజ, వై.సురేష్ పాల్గొన్నారు.